

పీఎండీడీకేవైని సద్వినియోగం చేసుకోండి

● కలెక్టర్ శ్యాంప్రసాద్ ● ఢిల్లీ నుంచి వర్చ్యువల్‌గా ప్రారంభించిన ప్రధాని

పుట్టపర్తి టౌన్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన (పీఎండీడీకేవై)ను జిల్లాలోని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. శనివారం ఢిల్లీ నుంచి ప్రధానమంత్రి నరేంద్రమోదీ పీఎండీడీకేవైను వర్చ్యువల్‌గా ప్రారంభించారు. పథకం ముఖ్య ఉద్దేశాన్ని ప్రధాని వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. పీఎండీడీకేవై పథకం అమలుకు దేశవ్యాప్తంగా 100 జిల్లాలను ప్రత్యేకంగా ఎంపిక చేశారని అందులో సత్యసాయి జిల్లా కూడా ఒకటి అన్నారు. తద్వారా జిల్లా కూడా ఈ సంవత్సరం లబ్ధి పొందనుందని చెప్పారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి మాట్లాడుతూ.. రైతు సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయని తెలిపారు. ప్రధాని మోదీ సహకారంతో రాష్ట్రంలో రైతు సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని అన్నారు. అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ పథకం ద్వారా ఏడాదికి రూ.20 వేలు రైతులకు అందిస్తోందని అన్నారు. కార్యక్రమంలో పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, జిల్లా వ్యవసాయాధికారి వి.రామునాయక్, పశుసంవర్ధక శాఖ జేడీ శుభదాస్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎమ్మెల్యే పరిటాల సునీత తదితరులు



జేబులు జాగ్రత్త..!



ధర్మవరం బస్టాండులో జేబుదొంగల చేతివాటం.. నగదు, సెల్‌ఫోన్‌లు తస్కరిస్తున్న వైనం

● లబోదిబోమంటున్న ప్రయాణికులు

● పట్టించుకోని ఆర్టీసీ అధికారులు

బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు



ధర్మవరం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ దొంగలకు కేరాఫ్ అడ్రస్ మారింది. బస్టాండులో ప్రయాణికుల రద్దీని ఆసరా చేసుకుని జేబు దొంగలు చెలరేగిపోతున్నారు. ప్రయాణికులు బస్సులు ఎక్కే హడావుడిలో ఉండగా దొంగలు తమ పనిని సునాయాసంగా కానిచ్చేస్తున్నారు. నగదుతోపాటు ఖరీదైన సెల్‌ఫోన్‌లు ఇతర వస్తువులను పోగొట్టుకుని బాధితులు లబోదిబోమంటున్నారు. తరచూ ఇలాంటి సంఘటనలు జరుగుతున్నా సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినవస్తున్నాయి.

వేలమంది రాకపోకలు..

సిల్క్‌సిటీగా పేరు గడించిన ధర్మవరానికి చుట్టు పక్కల గ్రామాలు, ఉమ్మడి జిల్లాతో పాటు కర్ణాటక నుంచి కూడా అనేక మంది వ్యాపార లావాదేవీలు, వివిధ పనులపై వస్తుంటారు. ఇక్కడి నుంచి రోడ్డు రవాణా సౌకర్యాలు అనుకూలంగా ఉండటంతో అనేకమంది ఆర్టీసీ బస్టాండుకు వస్తుంటారు. ఈక్రమంలోనే కేవలం ధర్మవరం డిపో నుంచే 90 బస్సులను వివిధ ప్రాంతాలకు నడుపుతున్నారు. ఇతర డిపోల నుంచి కూడా అనేక బస్సుల రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో ప్రతి రోజు ధర్మవరం బస్టాండ్ నుంచి వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో స్థానిక ఆర్టీసీ బస్టాండు నిత్యం ప్రయాణికులతో కిటకిటలాడుతూ ఉంటుంది. ఇదే అదనుగా కొందరు దొంగలు చోరీలకు పాల్పడుతూ ప్రయాణికులను ఇబ్బందుల్లోకి నెట్టేస్తున్నారు.

బస్టాండులో తచ్చాడుతూ..

ఉదయం నుంచి బస్టాండ్ ఆవరణలోనే తచ్చాడుతూ, బస్సు ఎక్కేటప్పుడు జేబులను కత్తిరిస్తున్నారు. నెల వ్యవధిలో దాదాపు 30సెల్‌ఫోన్‌లు చోరీ అయ్యాయంటే జేబుదొంగలు ఎంత పనిమంతులో అర్థమవుతోంది. చాలా మంది ప్రయాణికులు నగదు పోగొట్టుకున్నారు. కొందరు ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేస్తుండగా మరికొంతమంది మిన్నకుండిపోతున్నట్లు సమాచారం. అత్యవసరమైన వైద్యం, స్కూల్ ఫీజులు కట్టడానికి ఇతర ముఖ్యమైన పనుల కోసం వెళ్తున్న సమయంలో తరచు ఇలా జేబు దొంగతనాలు జరుగుతుండటం పట్ల పలువురు బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బాధితుల్లో ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు కూడా ఉండటం గమనార్హం. ప్రయాణికుల భద్రతే కాకుండా, బస్టాండ్‌లో వారి వస్తువులకు భరోసా కల్పించాల్సిన బాధ్యత కూడా ఆర్టీసీ అధికారులపై ఉందనే వాదన వినిపిస్తోంది. బస్టాండ్‌లో సీసీ కెమెరాలు ఉన్నా అవి సక్రమంగా పనిచేయలేదని సమాచారం. ఉన్న కెమెరాలు కూడా బస్సులు ఎక్కే ప్రాంతం వైపు కాకుండా ఒక కెమెరా మరుగుదొడ్ల వైపు, మరో కెమెరా బస్టాండ్ బయటకు చూపుతున్నట్లు తెలిసింది. ఇక సీసీ కెమెరాలున్నా ప్రయోజనం ఏంటని ప్రయాణికులు మండిపడుతున్నారు.

బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన సీసీకెమెరా



అడ్డుకట్ట వేస్తాం: సత్యనారాయణ, డిపో మేనేజర్



ఆర్టీసీ బస్టాండ్‌లో సెల్‌ఫోన్లు, నగదు చోరీలు జరుగుతున్న విషయం తెలిసింది. ఇదివరకే బస్టాండ్‌లో ప్రతిరోజు ఉదయం నుంచి ఇద్దరు కానిస్టేబుళ్లను ఏర్పాటు చేయాలని పోలీసులకు తెలియజేశా. అయితే బ్రహ్మోత్సవాలకు తిరుపతికి బందోబస్తుకు వెళ్లారు. కావున రెండురోజుల్లో బస్టాండ్‌లో పోలీసులను ఏర్పాటు చేసి చోరీలకు అడ్డుకట్ట వేస్తాం.

బాధితులకు సత్వర న్యాయం జరగాలి

● ఎస్పీ సతీష్ కుమార్



సమీక్షలో పాల్గొన్న ఎస్పీ సతీష్ కుమార్, హాజరైన కోర్టు పోలీసు సిబ్బంది



పుట్టపర్తి రూరల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): కోర్టులలో బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని కోర్టు మానిటరింగ్ సిబ్బంది, కోర్టు కానిస్టేబుళ్లకు ఎస్పీ సతీష్ కుమార్ సూచించారు. నిందితులను, సాక్షులను సకాలంలో కోర్టు ఎదుట హాజరుపరచాలని, తగిన సాక్ష్యాధారాలతో నేరస్థులకు శిక్ష పడేలా చూడాలని అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. కేసుల పురోగతిని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియచేయాలని ఆదేశించారు. అన్ని ట్రయల్ కేసుల్లో సత్వర, సక్రమ విచారణ జరిగేలా వ్యవహరించాలని ఆదేశించారు. బీఎన్‌ఎస్ చట్టంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కొత్తచట్టం మేరకు కోర్టు ప్రొసీడింగ్స్ జరిగేలా చూడాలని అన్నారు. సమావేశంలో డీసీఆర్బీ సీఐ శ్రీనివాసులు, సీఐ బొజ్జప్ప, లీగల్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డి, ఐటీ కోర్ ఇన్‌చార్జి సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

వైద్యానికి ప్రాధాన్యం ఇచ్చిన ఎన్టీఆర్

● పురం ఆస్పత్రి సమస్యలను పరిష్కస్తాం

● ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ



ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులతో సమీక్ష జరుపుతున్న ఎమ్మెల్యే బాలకృష్ణ, కలెక్టర్ శ్యాంప్రసాద్

హిందూపురం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): వైద్యానికి ఎన్టీఆర్ ఎంతో ప్రాధాన్యం ఇచ్చేవారని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో కలెక్టర్ శ్యాంప్రసాద్‌తో కలిసి వైద్యులతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి కమిటీకి ఎమ్మెల్యే చైర్మన్‌గా ఉండాలని ఎన్టీఆర్ హయాంలో జీఓ ఇచ్చారని బాలకృష్ణ అన్నారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నా.. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా కొనసాగారని గుర్తుచేశారు. ఆయన ప్రజల ఆరోగ్యంపై ఎంత శ్రద్ధ కనబరచారో దీన్నిబట్టే అర్థం చేసుకోవచ్చని అన్నారు. 2014 నుంచి 2019 వరకు ప్రభుత్వ ఆసుపత్రిలో ఓపీకి 200 మంది వచ్చేవారని, ఇప్పుడు ఆ సంఖ్య వెయ్యికి పెరిగిందని అన్నారు. వైద్యంలో అప్పటికి, ఇప్పటికి ఉన్న తేడాకి ఇది నిదర్శనమని అన్నారు. వైసీపీ హయాంలో ప్రభుత్వ ఆసుపత్రిని నిర్లక్ష్యం చేశారని అన్నారు. ప్రస్తుతం ఆసుపత్రిలో సమస్యలను పరిష్కరించేందుకు సమీక్ష ఏర్పాటు చేశామని అన్నారు. త్వరలోనే వైద్యులు వస్తారని, రోగులకు ఇబ్బంది లేకుండా చూస్తామని అన్నారు. ఆసుపత్రిలో అత్యాధునిక పరికరాలు ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. హిందూపురం ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక కృషిచేస్తున్నారని అన్నారు. ఏరో స్పేస్, డిఫెన్స్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ పరిశ్రమలు వస్తాయని, యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని అన్నారు. భూములు కోల్పోయే రైతులకు మంచి పరిహారం ఇప్పిస్తామని అన్నారు. హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి త్వరలోనే కొత్త వైద్యులు, సిబ్బంది వస్తారని కలెక్టర్ తెలిపారు. మూడు నెలల్లోపు ఆసుపత్రిలోని సమస్యలన్నీ పరిష్కరిస్తామని అన్నారు. సమీక్షలో ఆర్డీఓ ఆనంద్ కుమార్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ నాగకుమార్, తహసీల్దార్‌లు వెంకటేశ్, సౌజన్యలక్ష్మి పాల్గొన్నారు.





ఆరడుగుల కోసం..

● శ్మశానం లేక అవస్థలు ● పట్టించుకోని పాలకులు ● ధర్మవరంలో దుస్థితి

ధర్మవరం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మనిషి ఎంత సంపాదించినా చివరికి కావాల్సింది ఆరడుగులు స్థలం మాత్రమే. కానీ ప్రస్తుతం ఆ ఆరడుగుల జాగా కూడా దొరకని దుస్థితి ధర్మవరం పట్టణంలో నెలకొంది. సమాధులపై సమాధులు వెలుస్తున్నాయి. గుంతలు తీస్తుంటే నీళ్లు ఊరుతున్నాయి. దీంతో బంధువులు ఎంతో ఆవేదనకు గురవుతున్నారు. సరైన శ్మశాన స్థలం లేకపోవడంతో దూరంగా ఉన్న మరో శ్మశాన వాటికకు తరలించడానికి మృతుల బంధువులు ఎన్నో ప్రయాసలు పడుతున్నారు. పట్టణంలోని 25, 26, 27, 28 వార్డుల్లో శ్మశాన వాటికకు స్థలం లేక సమీపంలోని చెరువు ప్రాంతంలోనే అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. ఆయా వార్డుల్లో 25వేలకు పైగా జనాభా ఉన్నా శ్మశాన వాటికకు స్థలం కేటాయించకపోవడం దారుణమని కాలనీ వాసులు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రియాంక నగర్, పార్థసారధినగర్, లక్ష్మీచెన్నకేశవపురం, హమాలీకాలనీ, మహాత్మాగాంధీ కాలనీ, వైఎస్ఆర్, ఇందిరమ్మ, కేతిరెడ్డికాలనీల్లో ఉద్యోగులు, వ్యాపారులు, కూలీ పనులు, మగ్గం నేసేవారు నివాసం ఉంటున్నారు. ఇక్కడ ఎవరైనా చనిపోతే ఖననం చేసుకోవడానికి స్థలం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెరువు దగ్గరగాఉండటంతో అక్కడే ఖననం చేస్తున్నట్టు కాలనీ వాసులు పేర్కొంటున్నారు. వారానికే తొలగిస్తున్నారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు అడుగులు గొయ్యితీస్తే నీరు ఊరుతోందంటున్నారు. ప్రధాన శ్మశానవాటికకు శవాన్ని తరలించాలంటే 5 కిలో మీటర్ల దూరం ఉండటంతో ఖర్చు కూడా అధికంగా వస్తోందని పేర్కొంటున్నారు. తీరా అక్కడికి వెళితే స్థలం దొరకదని, చివరికి సమాధుల పైనే మళ్లీ పూడ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు.



ప్రస్తుతం ఖననం చేస్తున్న స్థలంలో ఊరుతున్న నీరు

స్థలం కేటాయించండి



శ్మశాన వాటికకు స్థలం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఎవరైనా చనిపోతే అంత్యక్రియలు చేయడానికి నానా అగచాట్లుపడుతున్నాం. మా కాలనీకి చెరువు దగ్గరలో ఉంది కదా అని శవాన్ని పూడ్చితే రెండు,మూడు రోజులకే గుర్తు తెలియని వ్యక్తులు తొలగిస్తున్నారు. శ్మశాన వాటికకు స్థలాన్ని కేటాయించాలని అధికారులను కోరుతున్నాం.

- ముత్యాలమ్మ, హమాలీకాలనీ, ధర్మవరం

ప్రధాన శ్మశాన వాటికకు వెళ్లలేం



ప్రధాన శ్మశాన వాటికలో శవాన్ని పూడ్చుకుందామనుకుంటే 5 కిలో మీటర్ల దూరం వెళ్లాలి. అంత దూరం వెళ్లాలంటే డబ్బులు ఉన్న వారు ఎలాగో భరించగలరు. పేదలు అంత డబ్బులు ఖర్చు పెట్టుకోలేరు. అక్కడికి వెళ్లినా ఆరు అరడుగుల స్థలం దొరుకుతుందన్న నమ్మకం లేదు. **-శివ, ఎల్‌సీకే పురం, ధర్మవరం**

మా దృష్టికి రాలేదు

శ్మశాన వాటికకు స్థల సమస్య మా దృష్టికి ఎవరూ తీసుకురాలేదు. ఎవరైనా అర్జీ ఇస్తే వాటిని పరిశీలించి ఉన్నతాదికారుల దృష్టికి తీసుకెళ్తాం. గతంలో ఎవరైనా ఇచ్చారో లేదో తెలియదు. నేను ప్రస్తుతం ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా ఉన్నాను.

- ఈశ్వరయ్య, ఇన్‌చార్జ్ తహసీల్దార్, ధర్మవరం

ఆలయాల అభివృద్ధికి హామీ: సవిత

పెనుకొండ టౌన్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): పెనుకొండలో ఆలయాల అభివృద్ధికి కృషిచేస్తానని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి హామీ ఇచ్చారని మంత్రి సవిత తెలిపారు. మంత్రిని ఆమె శనివారం రాజధానిలో కలిసి, కస్తూరి రంగనాథస్వామి, ఐముక్తేశ్వర, రామభద్ర ఆలయాలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. రంగనాథస్వామి ఆలయానికి రూ.1.90కోట్లు విడుదల చేస్తామని, ఐముక్తేశ్వర ఆలయానికి రూ.5.33 కోట్లకుగానూ రూ.1.60 కోట్లు సమకూర్చుతామని, మిగిలినవి సీజీఎఫ్ నుంచి తీసుకోవాలని మంత్రి సూచించారని సవిత తెలిపారు.



దేవదాయశాఖ మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న సవిత











గడ్డి బేల్స్ తయారు చేస్తున్న మిషన్

గడ్డిని మిషన్‌లో వేస్తున్న కూలీలు

పంట పండిన ఆలోచన



సిద్ధంగా ఉన్న గడ్డి బేల్స్

- శైలేజ్ గడ్డి తయారీని ప్రారంభించిన ఇద్దరు రైతులు
- నాలుగేళ్ల క్రితం స్థానిక అవసరాలకు ఉత్పత్తి
- సబ్సిడీ రుణాలతో విస్తరించిన వ్యాపారం
- ఇతర రైతులు.. కూలీలకు పెరిగిన ఆదాయం

విడపనకల్లు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఇద్దరు రైతుల ఆలోచన వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేసే రైతుల ఆదాయాన్ని పెంచింది. శైలేజ్ గడ్డిని తయారు చేయడం ద్వారా లాభాలను ఆర్జించేలా చేసింది. విడపనకల్లు మండలం పాల్తూరుకు చెందిన నజీర్, కరకముక్కల గ్రామానికి చెందిన ఉమా మహేష్ నాలుగేళ్ల క్రితం చిన్న యంత్రం సాయంతో శైలేజ్ గడ్డిని తయారు చేసి, అక్కడే అమ్మేవారు. ప్రభుత్వ సహకారంతో సబ్సిడీ రుణాలు తీసుకుని రూ.18 లక్షలతో గడ్డి బేల్స్ తయారు చేసే రెండు మిషన్లు, రూ.8 లక్షలతో రెండు ట్రాక్టర్లను వీరు కొనుగోలు చేశారు. కరకముక్కల వద్ద ఓ పొలంలో 8 నెలల క్రితం గడ్డి బేల్స్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇద్దరు రైతులు కలిసి దాదాపుగా రూ.1.25 కోట్లు పెట్టుబడి పెట్టారు. ఇందులో ప్రభుత్వం సబ్సిడీగా రూ.45 లక్షలు ఇచ్చింది. నెలకు రూ.1.20 లక్షలు కంతులు చెల్లిస్తున్నారు. సుమారు 20 కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్నారు.

సహజసిద్ధంగా..

సంచులకు నింపే సమయంలో మిక్స్ చేసిన మొక్కజొన్న గడ్డిలో ఎలాంటి కెమికల్స్, ఇతర పదార్థాలు కలపడం లేదు. పొలంలో ఉన్న పంటను కోసి మిక్స్ చేసి బేల్స్ గాను, సంచులకు నింపి ప్యాక్ చేస్తారు. ఈ విధంగా చేయటం వల్ల ఏడాది పాటు ఉంచినా పాడి పశువులు, గొర్రెలు, మేకలకు పచ్చి గడ్డిగా వాడుకోవచ్చు అంటున్నారు. బేల్స్ సిద్ధమయిన తరువాత జిల్లాలోని డెయిరీలతో పాటు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. బేల్స్‌ను ఒక్కొక్కటి 55 నుంచి 60 కిలోలు, సంచులకు 35 నుంచి 36 కిలోల వరకూ ప్యాక్ చేస్తారు. ఒక టన్ను గడ్డి రూ.6 వేలకు విక్రయిస్తారు. ఇక్కడ తయారు చేసిన గడ్డి బేల్స్‌ను, సంచులను హైదరాబాద్, మహారాష్ట్ర, కడప, బెంగళూరు. తిరుపతి, శ్రీకాళహస్తి, ఇస్కాన్ టెంపుల్, అనంతపురం వంటి పట్టణాలకు సరఫరా చేస్తున్నారు. కొందరు ఇక్కడికే వచ్చి గడ్డి బేల్స్‌ను కొనుగోలు చేసుకుని వెళుతున్నారు.

పెరిగిన సాగు

విడపనకల్లు మండలంలోని జీబీసీ కాలువ, బోరు బావుల కింద వేల ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేయించారు. సాగు చేసిన రోజు నుంచి 80 రోజులకు పాల కంకిగా ఉన్న సమయంలోనే పంటను శైలేజ్ గడ్డి తయారీకి కోతలు కోస్తారు. పాల కంకి మీద కోత కోయటంతోనే అధిక పోషకాలు ఉంటాయని.. 120 రోజుల పంటను 80 రోజులకే కోస్తారు. దీంతో రైతులు కేవలం 80 రోజులకే ఎకరా పంటను రూ.40వేల నుంచి రూ. 45 వేల వరకూ విక్రయిస్తున్నారు. రైతుల వద్ద నుంచి నేరుగా వీళ్లే కొనుగోలు చేసి పొలంలోనే కటింగ్ చేయించి మిషన్‌కు వేసి బేల్స్, సంచులకు నింపుతారు. గతంలో కూలీలతో మొక్క జొన్న పంటను కోయించి మిషన్లకు ఆడించే వారు. చిన్న కటింగ్ మిషన్ తెచ్చిన తరువాత పొలంలోనే మిక్స్ చేసి నేరుగా ప్యాకింగ్‌కు పంపుతున్నారు. ప్యాకింగ్ చేసే చోట రోజు 20 మంది కూలీలు పని చేస్తుంటారు. కరకముక్కల, హావళిగి, పాల్తూరు, చీకలగురికి, ఉండబండ, మాళాపురం, విడపనకల్లు, ఆర్. కొట్టాల తదితర ప్రాంతాల్లో మొక్క జొన్న పంట సాగు చేస్తున్నారు.

సబ్సిడీ రుణాలతో విస్తరించాం..





నాలుగేళ్లుగా రెండు చిన్న మిషన్లతో శైలేజ్ గడ్డి తయారు చేసి దగ్గర ప్రాంతాల్లోనే విక్రయించే వాళ్లం. ప్రభుత్వం సబ్సిడీ రుణాలు ఇవ్వడంతో ఎనిమిది నెలల క్రితం మరో రెండు కొత్త మిషన్లు కొనుగోలు చేసి విస్తరించాం. అప్పటి నుంచి కరకముక్కల వద్ద శైలేజ్ గడ్డి తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేశాం. చుట్టు పక్కల రైతుల పొలాల్లోనే మొక్క జొన్న పంట సాగు చేయించి వాటిని కొని పచ్చి గడ్డితో బేల్స్ సంచులకు నింపి ఇతర ప్రాంతాలకు విక్రయిస్తున్నాం.

- నజీర్, ఉమా మహేష్, శైలేజ్ గడ్డి తయారీదారులు

రూ.6 లక్షల లాభం



నేను ఈ సంవత్సరం 10 ఎకరాల్లో రెండుసార్లు మొక్క జొన్న పంటను సాగు చేశాను. పెట్టుబడులు పోను రూ. 6లక్షలు వరకూ లాభం వచ్చింది. గతంలో మొక్క జొన్నకు కోతలు, కంకి మిషన్‌కు వేయడానికి, విక్రయించడానికి నానా తిప్పలు పడాల్సి వచ్చేది. ఇప్పుడు శైలేజ్ గడ్డికి వాళ్లే పొలంలోకి వచ్చి కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. మార్కెట్ ధర ఎలా ఉన్నా ఎకరాకు రూ. 40 నుంచి రూ.45వేలు ఇచ్చి కొనుగోలు చేస్తున్నారు. 120 రోజుల పంటను 80 రోజులకే కటింగ్ చేస్తున్నారు. **- రుద్రన్న రైతు, కరకముక్కల**

మూడు కోతలు ఇచ్చా



నేను ఆరు ఎకరాల్లో మొక్క జొన్న సాగు చేశాను. ఇప్పటికే మూడు కోతలు (పంటలు) వచ్చాయి. ఎకరాకు రూ. 40 వేల ప్రకారం తీసుకున్నారు. పాల కంకి మీద పంటను 80 రోజులకే తీసుకోవటంతో పంట కోత బాధ లేదు. అంతా శైలేజ్ గడ్డి నిర్వాహకులే చూసుకుంటున్నారు. మాలాంటి ఎంతో మంది రైతులతో సాగు చేయించి లాభాలు చూపుతున్నారు. గతంలో మిరప, ఇతర పంటలు సాగు చేసి నష్టాలపాలయ్యాను. శైలేజ్ గడ్డికి విక్రయాలతో ప్రశాంతంగా ఉన్నాం. **- నాగేష్, రైతు, కరకముక్కల**

రోజుకు రూ.800 కూలి..



నేను గతంలో పొలం పనులకు వెళితే రోజుకు రూ. 300 నుంచి రూ.400 మాత్రమే ఇచ్చేవారు. కరకముక్కలలో శైలేజ్ గడ్డి మిషన్లు నింపేందుకు వెళుతున్నా. రోజుకు రూ. 800 కూలి ఇస్తున్నారు. మిషన్ల వద్ద పని చేసే వారు కాకుండా కూలీలమే 20 మందికి పైగా ఉన్నాం. మాకు నెలకు ఒక్కొక్కరికి రూ. 20వేలు పైనే వస్తోంది. చేతి నిండా పని ఉంది. ఎవరి పనికి వెళ్లాలనే ఆలోచన కూడా లేదు. మా కుటుంబాలు గడవటానికి ఎలాంటి ఇబ్బంది లేదు. **- సురేష్, కూలీ, పాల్తూరు**

రోజూ పని దొరుకుతోంది..



గతంలో ఒక రోజు పని ఉంటే, మూడు నాలుగు రోజులు ఇంటి వద్దే ఉండేవాడిని. పని లేక నానా ఇబ్బందులు పడ్డా. ఇప్పుడు ఆ ఆలోచనే లేదు. రోజూ శైలేజ్ గడ్డి తయారీ కేంద్రానికి వచ్చి పనులు చేసుకుంటున్నాం. ఎనిమిది నెలలుగా మాకు చేతి నిండా పని దొరికింది. రోజు కూలి రూ. 800 ఇస్తున్నారు. మా కుటుంబ సభ్యులు అందరికి చేతి నిండా పని దొరికింది. **- రవి, కూలీ, కరకముక్కల**

సమానత్వం కోసం పోరాటం

- ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి



ముగింపు సభలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

అనంతపురం టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సమాజంలో, కుటుంబంలో మహిళ పట్ల వివక్ష కొనసాగుతోందని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి అన్నారు. అందుకే సమానత్వం కోసం ఐద్వా పోరాడుతోందని అన్నారు. పోరాటంలో అందరూ భాగం కావాలని పిలుపునిచ్చారు. ఐద్వా 16వ మహాసభల నేపథ్యంలో ఆర్ట్స్ కళాశాలలో శనివారం నిర్వహించిన వేడుకలలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఈ నెల 13 నుంచి నగరంలో నిర్వహించే రాష్ట్ర మహాసభలకు అన్నివర్గాల ప్రజలు తరలివచ్చి జయప్రదం చేయాలని ఐద్వా నాయకురాలు డాక్టర్ ప్రసూన కోరారు. 13వ తేదీ ఉదయం 10.30 గంటలకు ఆర్ట్స్ కళాశాల మైదానం నుంచి ర్యాలీ నిర్వహిస్తామని, అనంతరం లలిత కళా పరిషత్‌లో సభ ఉంటుందని తెలిపారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

ఐద్వా ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 16 వేల ముగ్గులతో రాష్ట్ర మహా సభలకు స్వాగతం పలికారు. జిల్లా కేంద్రంలోని మల్లు స్వరాజ్యం కాలనీ, ఇందిరా నగర్, సీతారామ్ ఏచూరి కాలనీ, గణేనాయక్ కాలనీ, మహదేవనగర్ తదితర ప్రాంతాల్లో ఐద్వా రాష్ట్ర మహాసభలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ మహిళలు ముగ్గులను వేశారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి, రాష్ట్ర కోశాధికారి సావిత్రి ముగ్గులను పరిశీలించారు. ముగ్గులు వేసిన వారిని వారు అభినందించారు.

ముగిసిన సాంస్కృతికోత్సవాలు

ఐద్వా ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఈ నెల 9వ తేదీ నుంచి నిర్వహిస్తున్న సాంస్కృతికోత్సవాలు శనివారం అట్టహాసంగా ముగిశాయి. తొలి రెండురోజులు కృష్ణకళామందిర్‌లో, మూడో రోజు శనివారం ఆర్ట్స్ కళాశాల డ్రామా హాల్‌లో ఉత్సవాలను నిర్వహించారు. విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరై సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. ఆటపాటలతో అలరించారు. అనంతరం ఐద్వా నాయకురాలు ప్రగతి అధ్యక్షతన ముగింపు సభను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలిండియా రేడియో వ్యాఖ్యాత శ్యామసుందర శాస్త్రి, కవి షేక్ రియాజుద్దీన్, ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్యామల, చంద్రిక, నగర అధ్యక్ష కార్యదర్శులు శంషు, అశ్విని, జిల్లా నాయకులు రామాంజినమ్మ, గీత, శైలజ, పద్మావతి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గిరి, పరమేష్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు కృష్ణమూర్తి పాల్గొన్నారు.



చిన్నారుల నృత్య ప్రదర్శన

పైసలిస్తేనే పేరు మార్పు!



- రేషన్ డీలర్ల పేర్ల మార్పునకు మామూళ్లు
- అనంతపురం అర్బన్‌లో అవినీతి బాగోతం



అనంతపురం అర్బన్ తహసీల్దార్ కార్యాలయం

అనంతపురం రూరల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): పౌరసరఫరాల శాఖలో పని జరగాలంటే పైసలు ముట్టజెప్పాల్సిందేననే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రేషన్‌షాపు డీలర్ల పేరు మార్పునకు డబ్బులు వసూలు చేస్తున్నట్లు విమర్శలు వినవస్తున్నాయి. అనంతపురం అర్బన్ తహసీల్దార్ కార్యాలయం పౌరసరఫరాల విభాగంలో అధికారులు, ఉద్యోగుల మామూళ్లు ఇస్తేనే పనులు చేస్తున్నట్లు సమాచారం. అనంతపురం అర్బన్ పరిధిలో 137 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వీటిని కూటమి ప్రభుత్వం కొలువుదీరాక కూటమి పార్టీల సానుభూతిపరులకు కేటాయించారు. అప్పటి వరకు ఉన్న 'వైసీపీ డీలర్ల' పేర్లతో ఉన్న దుకాణాలను కూటమి నేతల పేర్లు మీదుగా మార్పు చేశారు. అయితే కొన్నింటిని మార్చలేదు. ఇలాంటివి ఇరవై వరకు ఉన్నట్లు సమాచారం. సంబంధిత వీఆర్వోల లాగిన్ ద్వారా ఈ దుకాణాల పరిధిలోని కార్డుదారులకు రేషన్ సరఫరా చేసేవారు. దీనివల్ల సమస్యలు వస్తుండటంతో ఆ డీలర్లు దుకాణాన్ని తమ పేరుమీదుగా మార్చుకునే ప్రయత్నం చేశారు. ఇటీవల పది దుకాణాలకు సంబంధించి డీలర్ల పేర్లు మార్చారు. మిగిలినవి కూడా మార్చేందుకు చర్యలు చేపట్టినట్లు సమాచారం. అయితే ఈ ప్రక్రియ పూర్తి చేయడానికి ఒక్కో డీలర్ నుంచి రూ.10వేలు ముడుపులు పుచ్చుకున్నట్లు సమాచారం.

బఫర్ క్లియర్‌కు పెద్ద మొత్తంలో వసూలు

కొత్త డీలర్లు బఫర్ స్టాక్‌తో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గత ప్రభుత్వంలోని డీలర్ల నుంచి క్లియర్ చేయాల్సి ఉండగా, ప్రస్తుత డీలర్లే బఫర్ స్టాక్ క్లియర్ చేయాలని సంబంధిత అధికారులు ఒత్తిడి పెంచారు. ఈక్రమంలోనే వారిపై 6ఏ కేసులు నమోదు చేశారు. ఎక్కువ మొత్తంలో బఫర్ స్టాక్ ఉన్న డీలర్ల నుంచి పెద్ద మొత్తంలోనే వసూలు చేసి బఫర్ క్లియర్ చేయించినట్లు తెలిసింది. అనంతపురం తహసీల్దార్ కార్యాలయానికి అతి సమీపంలోని ఓ రేషన్ షాపులో బఫర్ స్టాక్ క్లియరెన్స్‌కు సంబంధిత డీలర్ నుంచి రూ.75వేలు, మరో షాపులో ఇదే విధంగా రూ.లక్ష వరకు ముడుపులు అందుకున్నట్లు సమాచారం.

మా దృష్టికి రాలేదు



డీలర్ల పేర్ల మార్పు, బఫర్ క్లియర్‌కు డబ్బులు తీసుకున్న విషయం మా దృష్టికి రాలేదు. ఎవరూ ఫిర్యాదు కూడా చేయలేదు. క్షేత్రస్థాయిలో విచారిస్తాం. అలాంటివి ఏవైనా జరిగినట్లు తేలితే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

- హరికుమార్, తహసీల్దార్, అనంతపురం అర్బన్

చీనీ టన్ను రూ.15వేలు

అనంతపురం రూరల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్‌లో శనివారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.15వేలుతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరి రూ.12వేలు ధర పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 34 టన్నుల చీనీ కాయలు వచ్చినట్లు ఆయన తెలిపారు.



నీటి మాటలు..!

హెచ్చెల్సీ నీటి నిర్వహణలో గందరగోళం

- లెక్కలు చెప్పలేకపోతున్న ఇంజనీర్లు
- అస్తవ్యస్తంగా వ్యవహారాలు
- ఐఏబీ నిర్వహణలో తీవ్ర జాప్యం



హెచ్చెల్సీ

జిల్లా కరువును పారదోలేందుకు ఉన్న ఏకైక మార్గం నీరు. అలాంటి నీటి నిర్వహణలో అధికారులు తీవ్రంగా విఫలమవుతున్నారు. జిల్లాకు జీవనాడి అయిన తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ) నీటి నిర్వహణను గాలి కొదిలేశారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు ఏకంగా 13 టీఎంసీల నీరు తీసుకుంటే.. ఎక్కడ ఇచ్చామన్న లెక్కలు కూడా ఇంజనీర్లు చెప్పలేకపోతుండడం శోచనీయం. జలాశయాలు నింపామంటూ దాటవేస్తున్నారు. నెలలుగా రెగ్యులర్ ఎస్ఈ లేకపోవడంతో ఈఈలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆ శాఖలో జోరుగా చర్చ సాగుతోంది. కొందరు అధికారులు ఆఫీసుల వైపు కూడా చూడట్లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కీలకమైన సాగునీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశం నిర్వహణలో కూడా జాప్యం చేస్తున్నారంటే వారి నిర్లక్ష్యం ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాకు ప్రధాన నీటి వనరుగా ఉన్న తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ)ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారు. టీబీ డ్యాం నుంచి హెచ్చెల్సీకి జూలై 16వ తేదీన నీరు విడుదల చేశారు. అప్పటి నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. అప్పటి లెక్కల ప్రకారం టీబీ డ్యాంలో నీటి నిల్వ ఆధారంగా హెచ్చెల్సీకి 24.065 టీఎంసీలు కేటాయించారు. ఇప్పటి వరకు 12.710 టీఎంసీలు విడుదల చేయగా.. 105వ కిలోమీటరు వద్ద సరిహద్దుకు 11.510 టీఎంసీలు చేరింది. హంద్రీనీవా నుంచి మరో రెండు టీఎంసీల నీరు హెచ్చెల్సీకి తీసుకున్నారు. మొత్తం 13 టీఎంసీల నీటిని ఎక్కడ.., ఏయే ప్రాంతాలకు వినియోగించారనే అంశంపై హెచ్చెల్సీ ఇంజనీర్ల వద్ద లెక్కలు లేకపోవడం శోచనీయం. 85వేల ఎకరాల ఆయకట్టుకు 3.344 టీఎంసీల సాగునీరు ఇచ్చామని హెచ్చెల్సీ ఇంజనీర్లు చెబుతున్నా.. ఆ స్థాయిలో నీరు చేరలేదని క్షేత్రస్థాయిలో రైతులు చెబుతున్నారు. ఇది హెచ్చెల్సీ నిర్వహణ అస్తవ్యస్తం, గందరగోళానికి మరింత ఊతమిస్తోంది. వచ్చిన నీటిని సక్రమంగా నిల్వ చేసి, ఆయకట్టుకు వదిలి, తాగునీటి అవసరాలకు సక్రమంగా పంపిణీ చేయాల్సిన హెచ్చెల్సీ అధికారులు చేతులెత్తేస్తున్నారు. ఇలా హెచ్చెల్సీ పాలన అస్తవ్యస్తంగా మారింది. దీంతో ఏటా నిర్వహించే ఐఏబీ సమావేశం ఏర్పాటులో విఫలమవుతున్నారు. ఏటా జూన్, జూలై, ఆగస్టు నెలల్లోనే ఐఏబీ సమావేశం నిర్వహించి నీటి కేటాయింపులు, విడుదల తేదీలను నిర్ణయించేవారు. హెచ్చెల్సీలో నెలకొన్న గందరగోళ పరిస్థితుల కారణంగా ఐఏబీ నిర్వహణలో జాప్యం చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇంజనీర్లది తలోదారి...

హెచ్చెల్సీ పరిధిలో నాలుగు డివిజన్లు ఉన్నాయి. హెచ్చెల్సీ, హెచ్చెల్సీ లోక్, ఐబీ, ధర్మవరం బ్రాంచ్ కెనాల్ డివిజన్లుగా విభజించారు. ఆయా డివిజన్ల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు (ఈఈలు) సక్రమంగా పనిచేస్తేనే ఆయకట్టుకు సాగునీరు సక్రమంగా అందించగలరు. హెచ్చెల్సీ డివిజన్ ఈఈ ఎప్పుడు కార్యాలయానికి వస్తారో... అక్కడ పనిచేసే సిబ్బందికి కూడా సమాచారం ఉండదని తెలుస్తోంది. నిత్యం క్షేత్రస్థాయిలో ఉన్నట్లు చెబుతూ ఇంటికే పరిమితమవుతూ ఈఈ విధుల పట్ల పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆ శాఖలో జోరుగా చర్చ సాగుతోంది. మిగిలిన ఇంజనీర్లు కూడా అదే పరిస్థితిలో ఉన్నారు. ఈఈలే ఇలా ఉంటే.. డీఈలు, ఏఈల పరిస్థితి చెప్పనక్కర్లేదు.

రెగ్యులర్ ఎస్ఈ కరువు

హెచ్చెల్సీకి రెగ్యులర్ ఎస్ఈ లేకపోవడం శోచనీయం. రెగ్యులర్ ఎస్ఈగా ఉన్న రాజశేఖర్ ఏప్రిల్‌లో ఉద్యోగ విరమణ పొందారు. దీంతో మే నెలలో మైనర్ ఇరిగేషన్ ఎస్ఈగా ఉన్న విశ్వనాథ్‌రెడ్డికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. జూన్‌లో విశ్వనాథ్‌రెడ్డిని కూడా తప్పించి మైనర్ ఇరిగేషన్‌లో డిప్యూటీ ఎస్ఈగా ఉన్న సుధాకర్ రావును హెచ్చెల్సీ ఇన్‌చార్జి ఎస్ఈగా నియమించారు. అప్పట్నుంచీ ఇన్‌చార్జి పాలనే. విధి నిర్వహణలో ఇంజనీర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే చర్చ ఆ శాఖలో సాగుతోంది. రెగ్యులర్ ఎస్ఈ లేకపోవడంతో ఐఏబీ నిర్వహణలోనూ జాప్యం అవుతోంది. దీంతో రైతులు ఆయకట్టుకింద సాగుచేసిన పంటలకు సక్రమంగా నీరు అందక నష్టపోయే ప్రమాదం పొంచి ఉంది.

అంతా సరిదిద్ది.. ఐఏబీలో నిర్ణయిస్తారు



హెచ్చెల్సీలో అన్నింటినీ సరిదిద్ది... వ్యవస్థను గాడిలో పెట్టే పనిలో ఉన్నాం. నీటి కేటాయింపుల విషయంపై ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు ప్రణాళిక రూపొందిస్తాం. త్వరలో ఐఏబీ సమావేశం నిర్వహించి, నీటి కేటాయింపులు, విడుదల తేదీలను ఖరారు చేస్తారు. ఆ మేరకు కాలువలకు నీరు విడుదల చేయడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటాం. ఇప్పటి వరకు టీబీ డ్యాం నుంచి, హంద్రీనీవా ద్వారా తీసుకున్న నీటిని ఆయా రిజర్వాయర్లలో నిల్వ చేశాం.

- సుధాకర్‌రావు, హెచ్చెల్సీ ఎస్ఈ

జిల్లా టీచర్‌కు రాష్ట్ర పదవి


- పండిత పరిషత్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎంపిక



అనంతపురం విద్య, అక్టోబరు11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ ఉపాధ్యాయపండిత పరిషత్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అనంతపురం జిల్లాకు చెందిన ఎర్రిస్వామి నియమితులయ్యారు. గుంటూరులో శనివారం జరిగిన రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర కమిటీ ఎంపిక జరిగింది. అందులో జిల్లాకు చెందిన ఎర్రిస్వామిని ఏకగ్రీవంగా నియమించారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎంపికైన ఎర్రిస్వామికి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హనుమేష్, తులసిరెడ్డి, నాయకులు గురివిరెడ్డి, సంజీవ్‌కుమార్, గోపాల్, నవీన్, ధనుంజయ, రమణారెడ్డి అభినందనలు తెలిపారు. ప్రస్తుతం ఎర్రిస్వామి ఉరవకొండ మండలం మోపిడి జడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు.

టమోటా కిలో రూ.20

అనంతపురం రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో శనివారం కిలో టామోటా గరిష్ఠంగా రూ.20తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. మార్కెట్‌కు 1,650 టన్నుల టమోటా కాయలు వచ్చాయన్నారు. అదేవిధంగా టమోటా కిలో కనిష్ఠ ధర రూ.12, సరసరి రూ.15తో విక్రయాలు జరిగాయన్నారు.



రేపటి నుంచి ఎఫ్ఏ-2 పరీక్షలు



ఎఫ్ఏ-2 ప్రశ్నపత్రాల తరలింపును పర్యవేక్షిస్తున్న డీసీఈబీ సెక్రెటరీ శ్రీనివాసులు

అనంతపురం విద్య, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో ఎఫ్ఏ-2 పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రాథమికపాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఉదయం 9-30 నుంచి 10-45 వరకు, మధ్యాహ్నం 1-15 నుంచి 2-30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఇవి మూడు రోజులు కొనసాగనున్నాయి. ఆరు నుంచి పదో తరగతి వరకు ఉదయం రెండు, మధ్యాహ్నం రెండు చొప్పున సబ్జెక్టుల వారీగా పరీక్షలు నాలుగు రోజులు నిర్వహించనున్నారు. ఇప్పటికే ఎస్‌సీఈఆర్టీ ఆధ్వర్యంలో ప్రశ్నపత్రాలు ముద్రించి జిల్లాకు పంపారు. వాటిని జిల్లా పరీక్షల విధాన మండలి ఆధ్వర్యంలో ప్రాథమిక పరీక్షల ప్రశ్నపత్రాలు క్లస్టర్ కాంప్లెక్స్‌లకు, 6నుంచి10వరకు ప్రశ్నపత్రాలను ఎమ్మార్సీలకు ఇప్పటికే తరలించారు. ఏరోజు పరీక్ష ప్రశ్న పత్రాలను ఆరోజే గంట ముందు మాత్రమే సంబంధిత పాఠశాలల హెచ్‌ఎంలు లేదా టీచర్లు తీసుకెళ్లాల్సి ఉంటుందని డీసీఈబీ సెక్రెటరీ గంధం శ్రీనివాసులు తెలిపారు.

అర్ధ శతాబ్దపు అనుబంధం

- ఎస్కేయూలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



వర్సిటీలోని కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ వద్ద పూర్వ విద్యార్థులు

అనంతపురం రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో 1975-77 ఎమ్మెస్సీ కెమిస్ట్రీలో చదివిన విద్యార్థుల ఆత్మీయ కలయిక శనివారం జరిగింది. ఆనాటి విద్యార్థులంతా ఐదు దశాబ్దాల తర్వాత ఒక చోట కలిసి ఉల్లాసంగా గడిపారు. వర్సిటీలో వారు చదివిన క్లాస్ రూమ్‌లలో తిరుగాడారు. ఈ కార్యక్రమానికి కెమిస్ట్రీ హెడ్ ఆఫ్‌ది డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ వెంకటరమణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అప్పటి విద్యార్థులు గత స్మృతులను నెమరువేసుకున్నారు. ఇక్కడ నేర్చుకున్న విజ్ఞానంతోనే లెక్చరర్లు, ప్రొఫెసర్లుగా స్థిరపడి సమాజసేవ చేసినట్లు తెలిపారు. పూర్వ విద్యార్థి, విశ్రాంత ఆర్ఐఓ క్రిష్టప్ప అధ్యక్షతన చేపట్టిన ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు వైజాగ్ నుంచి వేణుగోపాల్‌రావు, హైదరాబాద్ నుంచి రంగనాయకులు, ఉదయ్ కుమార్, ఆదోని నుంచి గోవిందరాజులు, తంజావూరు నుంచి హిదయతుల్లా, కర్నూలు నుంచి సుబ్బక్రిష్ణ, చంద్రశేఖర్, వెంకటకృష్ణ తదితరులు హాజరయ్యారు.

యువకుడి ఆత్మహత్య


కులవర్ధన్ (ఫైల్)

ధర్మవరం రూరల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ధర్మవరం రైల్వే పరిధిలోని గంగులకుంట గ్రామ సమీపంలో ఓ యువకుడు రైలు కిందపడి శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ పోలీసులు, మృతుడి బంధువులు తెలిపిన మేరకు అనంతపురం రూరల్ మండలం ఆకుతోటపల్లికి చెందిన సాకే రాము, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు సాకే కులవర్ధన్(21) వ్యవసాయ కూలి పనులకు వెళ్లేవాడు. పదేళ్ల కిందటే మృతుడి తండ్రి రాము మృతి చెందడంతో కులవర్ధన్ వ్యవసాయ పనులతో పాటు తల్లితో కలిసి పాడిఆవులతో జీవనం సాగించేవాడు. ఏడాది కిందట అప్పు చేసి, లక్ష రూపాయల బైకు కొన్నాడు. అయితే అప్పులు తీర్చకుండా, పనులకు వెళ్లకుండా ఉండటంతో తల్లి మందలించారు. దీంతో మనస్తాపం చెందిన కులవర్ధన్ గంగులకుంట గ్రామ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వేకీమెన్ సమాచారంతో జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతుడి వద్ద ఉన్న సెల్‌ఫోన్ ఆధారంగా కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో కుటుంబసభ్యులతో పాటు బంధువుల రోదనలు మిన్నంటాయి.

బతుకు తెరువు కోసం వచ్చి బలి

● విద్యుదాఘాతంతో కడప జిల్లా వాసి మృతి


జనార్దన్ మృతదేహం

కుందుర్పి/అనంతపురం వైద్యం అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): బతుకుదెరువు కోసం ఓ వ్యక్తి ఊరుగాని ఊరికి వచ్చి బలైపోయిన సంఘటన శనివారం కుందుర్పిలో జరిగింది. మండలకేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుదాఘాతంతో కడపజిల్లాకు చెందిన కూలీ జనార్దన్(43) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు కుందుర్పిలో నూతన విద్యుత్ లైను ఏర్పాటు పనులను కాంట్రాక్టర్ రమేష్ గత కొన్ని రోజులుగా చేయిస్తున్నాడు. ఈ పనులు చేసేందుకు దినకూలీగా కడప జిల్లా ఆర్‌ఎస్ కొండాపురం మండలం కె.సుగుమంచుపల్లికి చెందిన జనార్దన్ వచ్చాడు. భార్య, పిల్లలు సొంతూరులో ఉండగా జనార్దన్ తోటి కార్మికులతో కలిసి కాంట్రాక్టర్ ఏర్పాటు చేసిన షెల్టర్‌లో ఉండేవాడు. ఈ నేపథ్యంలో శనివారం సబ్‌స్టేషన్‌లో పనులు చేస్తుండగా జనార్దన్ విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో ఆయన్ను అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య చంద్రకళ ఇద్దరు కుమారులు ఉన్నారు. జనార్దన్ మృతి వార్తను భార్య, బంధువులకు సమాచారం అందించారు. వారు హుటాహుటిన అనంతపురం ఆస్పత్రికి చేరుకున్నారు. విగతజీవిగా పడిఉన్న జనార్దన్‌ను చూసి భార్య, బంధువులు బోరున విలపించారు. కొన్ని నెలలుగా తన భర్తకు కూలి కూడా ఇవ్వలేదని మృతుడి భార్య ఆరోపించారు. న్యాయం చేయమని అడిగితే బీమా పేరుతో కాంట్రాక్టర్ మోసం చేస్తున్నాడని కన్నీటి పర్యంతరమయ్యారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కుందుర్పి పోలీసులు తెలిపారు.

గంజాయి సాగు చేస్తున్న వ్యక్తి అరెస్ట్

బుక్కరాయసముద్రం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): పొలంలో గంజాయి సాగు చేస్తున్న వెంకటసుబ్బారెడ్డి అనే వ్యక్తిని బుక్కరాయసముద్రం ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. గార్లదిన్నె మండలం కోటంక గ్రామ పరిధిలో వెంకటసుబ్బారెడ్డితో పాటు మరికొందరు తమ వ్యవసాయ పొలాల్లో గంజాయి సాగు చేస్తున్నారు. గంజాయితో పాలిచ్చే పశువులకు పొగ వేస్తే పాల దిగుబడి పెరుగుతుందనే అభిప్రాయంతో పొలాల్లో గుట్టుగా సాగు చేస్తున్నట్లు సమాచారం. ఈవిషయం బుక్కరాయసముద్రం ఎక్సైజ్ పోలీసులకు తెలియడంతో ప్రత్యేక బృందంతో శుక్రవారం సాయంత్రమే కోటంక వ్యవసాయ పొలాల్లో దాడులు నిర్వహించి, గంజాయి సాగుచేస్తున్న వ్యక్తిని స్టేషన్‌కు తరలించారు. అదే గ్రామంలో మరో వ్యక్తిని అరెస్టు చేసినా విషయం బయటకు పొక్కకుండా పోలీసులు జాగ్రత్త పడుతున్నారు. ఈ విషయంపై సీఐ నాగ సునీతను వివరణ కోరగా ఉన్నతాధికారుల అనుమతి లేనిదే తాను ఏ విషయం బయటకు చెప్పలేనని సమాధానమిచ్చారు..

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

బుక్కరాయసముద్రం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందపల్లి గ్రామ శివారులో అనంతపురం అమరావతి జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ దాదావలి(35) మృతి చెందాడు. తాడిపత్రికి చెందిన దాదావలి మినీవ్యాన్‌లో సరుకులు తీసుకుని అనంతపురం వచ్చి దింపేశాడు. అనంతపురం నుంచి తాడిపత్రికి బయల్దేరాడు. వెళుతుండగా గోవిందపల్లి వద్ద జాతీయ రహదారి వంతెనపై వాహనం అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు మినీ వ్యాన్ అద్దాలు పగలడంతో దాదావలి ఎగిరి వంతెన కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తీరని విషాదం

● రెండు రోజుల వ్యవధిలో ఇద్దరు పోలీసుల మృతి


నందగోపాల్(ఫైల్)


సతీష్‌కుమార్(ఫైల్)

అనంతపురం క్రైం/గార్లదిన్నె, అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్‌శాఖను సిబ్బంది మరణాలు కుదిపేస్తున్నాయి. 48 గంటల్లోనే ఒక హెడ్ కానిస్టేబుల్, మరో కానిస్టేబుల్ మరణించడంతో వారి కుటుంబాల్లోనూ, డిపార్టుమెంట్‌లోనూ విషాదం నింపింది. పోలీసులు, కుటుంబీకుల సమాచారం మేరకు హెడ్ కానిస్టేబుల్ నందగోపాల్ (1996 బ్యాచ్) జిల్లా పోలీస్ కార్యాలయంలోని పీసీఆర్ విభాగంలో పనిచేస్తున్నారు. ఆయనకు మధుమేహం ఉన్నట్లు సమాచారం. ఇతడి కుమారుడు హైదరాబాద్‌లో తల్లితో కలిసి ఉంటూ గ్రూప్స్‌కు ప్రిపేర్ అవుతున్నాడు. కుమార్తె ఎంబీబీఎస్‌లో చేరడానికి సిద్ధమై తండ్రితో కలిసి అనంతపురంలోనే ఉంటోంది. గురువారం నందగోపాల్ కొంత అస్వస్థతకు గురయ్యాడు. కుమార్తె ఆసుపత్రికి తీసుకెళ్లేలోగా దారి మధ్యలోనే ఆయన మృతి చెందాడు.

ట్రాఫిక్ కానిస్టేబుల్..

గార్లదిన్నె మండలంలోని పాతకల్లూరు గ్రామానికి చెందిన ట్రాఫిక్ కానిస్టేబుల్ అంగజాల సతీష్ యాదవ్(41) శనివారం శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. పాతకల్లూరుకు చెందిన అంగజాల శ్రీనివాసులు, నారాయణమ్మ దంపతులు కుమారుడు సతీష్ యాదవ్ 2009లో పోలీస్ శాఖలో కానిస్టేబుల్ ఉద్యోగం పొందాడు. ప్రస్తుతం అనంతపురంలో ట్రాఫిక్ కానిస్టేబుల్‌గా పని చేస్తూ కళ్యాణదుర్గం బైపాసులో నివాసం ఉన్నాడు. శనివారం తెల్లవారుజామున అస్వస్థతకు గురవడంతో కుటుంబ సభ్యులు దగ్గరలోని ఓ ప్రైవేట్ అస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. సాయంత్రం మృతదేహాన్ని స్వగ్రామమైన పాతకల్లూరుకు తరలించి, పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

సెలవులో ఉండగానే...

అంగజాల సతీష్ యాదవ్ ఇటీవల సుమారు 41 రోజులు సెలవు తీసుకున్నారు. ఈ సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి పలు పుణ్యక్షేత్రాలు, విహారయాత్రలు చేశాడు. రెండు రోజుల కిందట గోవా నుంచి వచ్చినట్లు సమాచారం. రెండు రోజుల వ్యవధిలోనే ఇద్దరు పోలీసులు మరణించడంతో డిపార్టుమెంట్‌లో విషాద ఛాయలు అలముకున్నాయి.

శిక్షణకు నిధుల మంజూరు

అనంతపురం అర్బన్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాల సభ్యులకు మన డబ్బులు - మన లెక్కలు బుకింగ్ యాప్‌పై శిక్షణ కార్యక్రమాలకు ప్రభుత్వం రూ.9.30 లక్షలు మంజూరు చేసిందని డీఆర్‌డీఏ పీడీ శైలజ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని 31 మండల సమాఖ్యలకు ఈ నిధులు విడుదల చేశామన్నారు. జిల్లాలోని 35,448 స్వయం సహాయక సంఘాలు, 1330 గ్రామైఖ్య సంఘాల సభ్యులకు మన డబ్బులు- మన లెక్కలు యాప్ అమలు, ప్రయోజనాలపై ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించి, సంపూర్ణ అవగాహన కల్పిస్తామని తెలిపారు.

నిలిచిపోయిన జల విద్యుత్ ఉత్పత్తి

పీఏబీఆర్‌లో టర్బైన్‌కు మరమ్మతులు


గేటుకు అడ్డంగా సీలింగ్‌ను వేస్తున్న దృశ్యం

కూడేరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్)లో జల విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. శుక్రవారం మధ్యాహ్నం నుంచి జల విద్యుత్ కేంద్రంలోని నీటి నుంచి విద్యుత్‌ను తీసే టర్బైన్ మరమ్మతులకు రావడంతో జెన్-కో అధికారులు ఉత్పత్తి నిలిపివేశారు. గత ఆదివారం జల విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించగా.. శుక్రవారానికి 2లక్షల 68వేల యూనిట్లు తయారు చేసినట్లు జెన్- కో ఏడీఏ కేశవయ్య, ఏఈ కిరణ్ పేర్కొన్నారు. జల విద్యుత్ కేంద్రంలో రెండు టర్బైన్లు ఉన్నాయి. 2022-2023లో జరిగిన విద్యుత్ ఉత్పత్తి సమయంలో రెండు టర్బన్లతో విద్యుత్‌ను తయారు చేశారు. ఆ సమయంలో ఒక టర్బైన్ మరమ్మతుకు రావడంతో నిలిపి వేయగా.. రెండో టర్బైన్‌తో ఉత్పత్తి కొనసాగించారు. అదే సమయంలో రెండో టర్బైన్‌కు కూడా సమస్య రావడంతో మరమ్మతులు చేసి ఉత్పత్తి మొదలు పెట్టారు. అనంతరం రెండు టర్బైన్ పూర్తి స్థాయి మరమ్మతులపై జెన్-కో అధికారులు దృష్టి పెట్టలేదు. దీంతో ఉన్న ఒక టర్బైన్‌తో విద్యుత్‌ను ఉత్పత్తి చేయడానికి జెన్-కో అధికారులు సిద్ధం చేశారు. 500 క్యూసెక్కుల నీటితో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించగా.. ఐదు రోజులు పాటు విద్యుత్ ఉత్పత్తి సాఫీగా సాగింది. అనంతరం టర్బైన్‌లో వైబ్రేషన్ సమస్య తలెత్తడంతో ముందు జాగ్రత్తగా ఉత్పత్తి నిలిపివేశారు. ప్రస్తుతం డ్యాంలో 5.214 టీఎంసీ నీరు నిల్వ ఉండటంతో ఒత్తిడి అధికంగా ఉంది. దీంతో టర్బైన్ మరమ్మతుల సమయంలో నీరు బయటకు వస్తుందనే ఉద్దేశ్యంతో అధికారులు డ్యాం నుంచి నీరు వచ్చే గేటుకు పూర్తిగా సీల్ వేశారు. మరో రెండు రోజుల్లో నిపుణులు పరిశీలించి మరమ్మతులు పూర్తి చేస్తే.. ఉత్పత్తి తిరిగి ప్రారంభమయ్యే అవకాశం ఉంటుందని తెలుస్తోంది.

ప్రభుత్వ వైద్యుడిపై దాడి

పోలీసులకు ఫిర్యాదు.. నలుగురిపై కేసు నమోదు


ఆసుపత్రి సూపరింటెండెంట్, డ్యూటీ డాక్టర్‌తో గొడవ పడుతున్న వినోద్

గుంతకల్లు టౌన్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో శనివారం మధ్యాహ్నం విధులు నిర్వహిస్తున్న పల్మనాలజిస్ట్ డాక్టర్ సల్మాన్ జావీద్‌పై చికిత్స కోసం వచ్చిన వినోద్‌తో పాటు ఉషాకిరణ్, సుధా, నారాయణ దాడికి పాల్పడ్డారని ఆసుపత్రి డాక్టర్లు తెలిపారు. ఈ సంఘటనపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జయవర్ధన్‌రెడ్డి, సల్మాన్ జావీద్, ఇతర డాక్టర్లు, నర్సులు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారు తెలిపిన మేరకు.. సీఐటీయూ కాలనీకి చెందిన వినోద్ అనే వ్యక్తి మరో వ్యక్తితో గొడవ పడి గాయపడ్డాడు. రక్తగాయాలతో వినోద్‌ను చికిత్స నిమిత్తం అదే కాలనీకి చెందిన ఉషాకిరణ్, సుధా, నారాయణ ఆసుపత్రికి తీసుకువచ్చి చైర్‌పై కూర్చోపెట్టారు. డ్యూటీలో ఉన్న డాక్టర్ సల్మాన్ జావీద్.. వినోద్‌ను ఏమైందని అడిగాడు. వెనుక కూర్చుంటే తెలియదని, ముందుకు వచ్చి కూర్చోవాలని డాక్టర్ చెప్పాడు. వెనుక కూర్చుంటే వైద్యం చెయ్యవా అంటూ డాక్టర్‌తో ముగ్గురు వాదనకు దిగారు. డాక్టర్ సల్మాన్ జావీద్ చొక్కా పట్టుకున్నారు. అడ్డుకోబోయిన స్టాఫ్ నర్సులను, మహిళా సెక్యూరిటీ గార్డును రాయలేని భాషలో తిట్టారు. ఆసుపత్రి సిబ్బంది విషయాన్ని సూపరింటెండెంట్‌కు తెలిపారు. ఆయనతో కూడా వారు గొడవకు దిగారు. ఘటనపై డాక్టర్లు, స్టాఫ్ నర్సులు, సిబ్బంది టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పలువురు నర్సులు మాట్లాడుతూ.. రాత్రి వేళలో డ్యూటీ చేయాలంటే భయంగా ఉందన్నారు. మద్యం సేవించి వచ్చి మహిళలని కూడా చూడకుండా అసభ్య పదజాలంతో తిడుతున్నారని వాపోయారు. ఆసుపత్రి వద్ద మూతపడిన పోలీస్ ఔట్ పోస్టును తెరపించి తమకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ విషయంపై టూటౌన్ సీఐ ఏపీ మస్తాన్‌ను వివరణ కోరగా.. విధి నిర్వహణలో ఉన్న డ్యూటీ డాక్టర్ సల్మాన్ జావీద్‌పై దాడికి పాల్పడి, అతడి విధులకు ఆటంకం కల్గించినందుకు వినోద్, ఉషాకిరణ్, సుధా, నారాయణపై 509, 353 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆ అమ్మాయి లేకపోతే బతకలేవా..?

ప్రేమ విఫలమైందని యువకుడి ఆత్మహత్య

గుండెలవిసేలా రోదించిన తల్లిదండ్రులు


సోమశేఖర్ (ఫైల్)

తాడిపత్రి, అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): ఏరా.. నాన్నా..! ఆ అమ్మాయి లేకపోతే బతకలేవా..? ఆమె కాదంటే మరొకరితో పెళ్లి చేసేవాళ్లం కదా..! ఎందుకింత మాకు అన్యాయం చేసి వెళ్లిపోయావ్' అంటూ ఆ తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. తాను ప్రేమించిన అమ్మాయి మోసం చేసిందని మండలంలోని కోమలి సమీపంలో శుక్రవారం రాత్రి సోమశేఖర్ (29) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ వరప్రసాద్ తెలిపిన మేరకు మండలంలోని పెద్దపొలమడ గ్రామానికి చెందిన మునయ్య కృష్ణవేణి దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరు మగ్గం నేసుకుంటూ జీవించేవారు. కొంతకాలంగా తల్లిదండ్రులు సోమశేఖర్‌కు వివాహ ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే కొన్ని రోజులు ఆగండి అంటూ అతడు వారిని వారించేవాడు. వారం రోజుల కిందట తల్లిదండ్రులు గట్టిగా నిలదీయడంతో సోమశేఖర్ తను ప్రేమలో మోసపోయిన విషయాన్ని తెలిపాడు. ఎంత ఓదార్చినా బాధపడుతూనే ఉండేవాడు. శుక్రవారం టౌన్‌కు వెళ్తున్నాని బయల్దేరాడు. రాత్రైనా తిరిగి ఇంటికి రాలేదు. అర్ధరాత్రి దాటిన తర్వాత ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకోవడం గమనించిన రైల్వే పోలీసులు ఘటనా స్థలికి వెళ్లి పరిశీలించారు. లభించిన ఆధారాలతో తల్లిదండ్రులకు సమాచారం అందించారు. వారు వచ్చి సోమశేఖర్‌ను గుర్తించి బోరున విలపించారు. అనంతరం రైల్వే పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వలపు వల

అమ్మాయిని మోసగించిన యువకుడి అరెస్టు

అనంతపురం క్రైం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో వలపు వల విసిరి, అమ్మాయిని మోసగించిన ఓ యువకుడిని అనంతపురం రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పామిడికి చెందిన వరుణ్ తేజ్(25) పాపంపేట విద్యారణ్యనగర్‌కు చెందిన ఓ యువతి(24)ని ఒక వివాహ వేడుకలో కలిశారు. ఈ క్రమంలో వరుణ్ తేజ్, ఆ యువతిని పరిచయం చేసుకున్నాడు. ఇద్దరి మధ్య మాట...మాట కలిసింది. తర్వాత సెల్‌ఫోన్ నెంబర్లు మార్చుకున్నారు. కొంతకాలం తర్వాత అది కాస్తా ప్రేమగా మారడంతో ఇద్దరూ ఒక్కటయ్యారు. ఆ యువతి వరుణ్ తేజ్ వద్ద పెళ్లి ప్రస్తావన తీసుకొచ్చింది. దీంతో మాట దాట వేస్తూ వచ్చాడు. అతడిపై ఒత్తిడి చేయగా... పెళ్లికి తిరస్కరించాడు. ఆమె రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. దీనిపై రూరల్ సీఐ శేఖర్ మాట్లాడుతూ...బాధితురాలి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామన్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

ఇరగంపల్లిలో విజయనగర రాజుల శాసనాలు


శాసనాలను చూపుతున్న ఉపాధ్యాయుడు

కొత్తచెరువు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఇరగంపల్లిలో విజయ నగర రాజుల కాలానికి చెందిన శాసనాలను గుర్తించామని ఉపాధ్యాయుడు గోపి తెలిపారు. ఈ శాసనాలు 1505- 1540 మధ్య కాలానికి చెందినవని తెలిపారు. రాయలసీమతో పాటు బళ్లారి ప్రాంతంలో అరుదుగా ఈ శాసనాలు బయటపడుతున్నాయని పేర్కొన్నారు. శ్రీకృష్ణదేవరాయల అంతరంగిక భటుడు గొడుగు పాలుడు ఈ శాసనాలు వేయించారని తెలిపారు. ఈ శాసనాల్లో వంగంపల్లిలో భూదానం గురించి, శాసనం పైభాగంలో అరికపవపురదసీమ అని రాసి ఉందన్నారు. అరికపవపురద అనేది ప్రస్తుత వంగంపల్లిలో ఉన్నప్రదేశానికి విజయనగర సామ్రాజ్యం కాలం నాటి పేరు అని, రధ సీమ అంటే రాజ్యంలోని పరిపాలన అని దీని అర్థం అన్నారు. ఈ శాసనాలను పురావస్తుశాఖ దృష్టికి తీసుకెళతామని తెలిపారు.

'పాత టైమ్‌టేబుల్ అమలు చేయండి'


మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

అనంతపురం విద్య, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): గురుకులాలలో ఉపాధ్యాయులకు పాత టైమ్‌టేబుల్ అమలు చేయాలని ఎస్టీయూ గురుకుల టీచర్స్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని ఉపాధ్యాయ భవన్‌లో గురుకులాల టీచర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డాక్టర్ అంబేడ్కర్ గురుకులాల పాఠశాలలకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. అలాంటి గురుకులాలలో కనీస వసతులు, సౌకర్యాలు లేక ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. 40 ఏళ్ల క్రితం నిర్మించిన క్వార్టర్స్ దెబ్బతిన్నా కనీస మరమ్మతులు కూడా చేయలేదని అన్నారు. నెలానెలా రూ.8వేల నుంచి రూ.12వేల వరకు హెచ్‌ఆర్‌ఏ కట్ చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో విభాగం రాష్ట్ర కోకన్వీనర్ రామానాయుడు, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, నాయకులు సూర్యుడు, మల్లికార్జున, అరుణ్‌కుమార్,చిన్నప్ప, హనుమంతు పాల్గొన్నారు.

నిలిచిన ఎన్టీఆర్ వైద్యసేవలు

పెండింగ్ బిల్లుల ఎఫెక్ట్

అనంతపురం వైద్యం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ఆసుపత్రుల్లో అమలవుతున్న ఎన్టీఆర్ వైద్యసేవ (ఆరోగ్యశ్రీ) పథకం పేదప్రజల పాలిట సంజీవిని. ఈ పథకం కింద ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రులకు సకాలంలో బిల్లులు మంజూరు కాకపోవడంతో సేవలు నిలిచిపోయాయి. గత ప్రభుత్వంలోని 2023 నుంచి పెండింగ్‌లో పడ్డ బిల్లులను, కూటమి ప్రభుత్వం ఏర్పాటు అనంతరం కొనసాగుతున్న సేవలకు గాను మొత్తం చెల్లింపులు జరిగిపోయాయి. కానీ, మార్చి నుంచి మళ్లీ బిల్లులు పెండింగ్‌లో పడ్డాయి. దీంతో జిల్లాలోని 47 ఎన్టీఆర్ వైద్యసేవల ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో సేవలను శుక్రవారం నుంచి నిలిపివేశారు. ఈ అంశంపై ఆంధ్రప్రదేశ్ స్పెషలిస్ట్ హాస్పిటల్స్ అసోసియేషన్(ఆశా)తో రాష్ట్ర ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతున్న నేపథ్యంలో పునఃప్రారంభమవుతాయని శనివారం రాత్రి వరకు భావించినా ఎదురు చూపులు ఫలించలేదు.

రూ.120 కోట్ల బకాయిలు...

ఎన్టీఆర్ వైద్యసేవల మొత్తం 47 ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రులకు గాను దాదాపు రూ.120 కోట్లు బకాయి పడ్డట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. గత నెలలో కొంత మొత్తాలు చెల్లింపులు జరిగాయి. పూర్తిస్థాయి మొత్తాలు చెల్లించకుండా పెద్దమొత్తంలో బిల్లులు పెండింగ్ పడితే సేవలను అందించడం కష్టసాధ్యమని ఆంధ్రప్రదేశ్ స్పెషలిస్ట్ హాస్పిటల్స్ అసోసియేషన్(ఆశా) ఎన్టీఆర్ వైద్యసేవలను నిలిపివేస్తూ ప్రభుత్వం వద్దకు చర్చలకు వెళ్లింది.

ఇబ్బందుల్లేకుండా చర్యలు..



ఎన్టీఆర్ వైద్యసేవలకు ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకున్నాం. ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రులకెళ్లిన వారిని ప్రభుత్వ సర్వజన వైద్యశాల, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించేందుకు అంబులెన్స్‌లను అందుబాటులో పెట్టుకున్నాం. పట్టణాల్లో కూడా అక్కడి ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించేలా చర్యలు తీసుకున్నాం.

- డాక్టర్ కిరణ్‌కుమార్,
జిల్లా సమన్వయకర్త, ఎన్టీఆర్ వైద్యసేవలు

ఫోన్ కాల్‌తో ఆగిన పెళ్లి..!

వధువుతో పరిచయం ఉందంటూ వరుడికి సమాచారం

పోలీసులకు యువతి కుటుంబం, గ్రామస్థుల ఫిర్యాదు


ఇటుకలపల్లి పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న మన్నీల గ్రామస్థులు

అనంతపురంరూరల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి నిర్వాకంతో ఓ యువతి పెళ్లి ఆగిపోయిన సంఘటన అనంతపురం రూరల్ మండలం మన్నీల గ్రామం లో శనివారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన మేరకు... గ్రామానికి చెందిన యువతికి రాప్తాడు మండలం గంగులకుంట గ్రామానికి చెందిన యువకుడితో వివాహం నిశ్చయించారు. శని, ఆదివారాల్లో పెళ్లి జరగాల్సి ఉంది. ఇరువైపుల వారు పెళ్లి సిద్ధమయ్యారు. అయితే మన్నీల గ్రామానికి చెందిన బాలచంద్ర శుక్రవారం వరుడికి ఫోన్ చేసి 'నువ్వు పెళ్లి చేసుకోబోయే అమ్మాయితో నాకు వ్యక్తిగత పరిచయం ఉంది. మేమిద్దరం కలిసి దిగిన ఫొటోలు కూడా ఉన్నాయి. కావాలంటే పంపుతా చూడు' అంటూ వాట్సాప్‌లో ఫొటోలు పంపాడు. వరుడు విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపాడు. దీంతో వారు పెళ్లి రద్దు చేసుకుంటున్నట్లు యువతి కుటుంబానికి సమాచారం ఇచ్చారు. పెళ్లి ఆగిపోవడానికి బాలచంద్ర కారణమని యువతి కుటుంబసభ్యులు ఇటుకలపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే బాలచంద్ర కుటుంబసభ్యులపై దాడి చేశారు. ఇది జీర్ణించుకోలేని బాల చంద్ర కుటుంబ సభ్యులు బాలు, జయ, ఈశ్వరయ్య, శివయ్య, అంజి తదితరులు శుక్రవారం సాయంత్రం గ్రామంలో పెద్ద ఎత్తున కేకలు వేస్తూ వేటకొడవళ్లు, రాడ్లతో హల్‌చల్ చేశారు. యువతి ఇంటికి వెళ్లి ఆమె కుటుంబసభ్యులపై దాడికి దిగారు. అయితే గ్రామస్థులంతా కలిసి వారిని అడ్డుకున్నారు. తర్వాత యువతి కుటుంబ సభ్యులతో కలిసి గ్రామస్థులంతా తిరిగి ఇటుకలపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెళ్లి ఆగిపోవడానికి కారణమైన బాలచంద్రపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కొత్త టీచర్లకు పాఠశాలల కేటాయింపు

ఉత్తర్వులు జారీ.. రేపటి నుంచి విధులకు..

అనంతపురం విద్య, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): డీఎస్సీలో ఎంపికయిన కొత్త టీచర్లకు పాఠశాలలను కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 748 మంది కొత్త టీచర్లకు వారం రోజులుగా ఉద్యోగ విధులపై శిక్షణ ఇచ్చారు. శుక్రవారం శిక్షణ కేంద్రాలలోనే 581 మంది స్కూల్ అసిస్టెంట్లకు ప్లేస్‌మెంట్స్ కేటాయింపునకు వెబ్ ఆప్షన్స్ తీసుకున్నారు. 167 మంది ఎస్జీ టీచర్లకు శిక్షణ కేంద్రంలోనే గురువారం రాత్రి మ్యాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించి ప్లేస్‌లను అక్కడికక్కడే కేటాయించారు. శనివారం ఈ కొత్తటీచర్లకు కేటాయించిన పాఠశాలలకు ఆర్డర్లను రాష్ట్రశాఖ విడుదల చేసింది. మధ్యాహ్నం సమయానికి ఎస్జీటీలకు ఆర్డర్లు రాగా... రాత్రికి స్కూల్ అసిస్టెంట్ల ఆర్డర్లు విడుదలయ్యాయి. ఆయా కొత్తటీచర్లకే మెసేజ్‌ల రూపంలో ఆర్డర్లు పంపారు. ఆర్డర్లు వచ్చిన కొత్తటీచర్లు సోమవారం నుంచి తమకు కేటాయించిన పాఠశాలలో విధులకు హాజరుకావాల్సి ఉంటుంది.

సూది మందే కారణమా..?

కేజీబీవీ విద్యార్థి మృతిపై అనుమానాలు

ఘటనపై రాష్ట్ర ఎస్పీడీ సీరియస్

అనంతపురం విద్య, అక్టోబరు11 (ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎంపీ సూది మందే బ్రహ్మసముద్రం కేజీబీవీ విద్యార్థి చందన మృతికి కారణమైందా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అనారోగ్యంతో బాధపడుతున్న చందనకు గత శుక్రవారం బ్రహ్మసముద్రంలోని ఓ ఆర్‌ఎంపీ వద్ద వైద్యం చేయించారు. ఆ సమయంలో నొప్పి తగ్గేందుకు ఓ ఇంజక్షన్ ఇచ్చినట్లు సమాచారం. తర్వాత విద్యార్థి ఆరోగ్య పరిస్థితి మరింత విషమించడంతో కళ్యాణదుర్గం తరలిస్తుండగా మృతి చెందినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. మృతి చెందిన విద్యార్థి చందనకు గుండె సమస్య ఉండేదని, శస్త్ర చికిత్స కూడా జరిగినట్లు సమగ్రశిక్ష అధికారులు చెబుతున్నారు. తరచూ అనారోగ్యంతో ఇబ్బందిపడేదని, ఆ సమయంలో తల్లిదండ్రులు వచ్చి ఇంటికి తీసుకెళ్లేవారని చెబుతున్నారు. గుండె శస్త్ర చికిత్స చేయించుకున్నవారు ఏదంటే ఆ మందు వాడకూడదని వైద్య నిపుణులు చెబుతున్నట్లు ఎస్‌ఎస్‌ఏ అధికారులు తెలిపారు. కాగా బ్రహ్మసముద్రం కేజీబీవీలో 9వతరగతి విద్యార్థిని చందన మృతిపై సమగ్రశిక్ష రాష్ట్ర ఎస్పీడీ శ్రీనివాసరావు సీరియస్ అయినట్లు తెలిసింది. ఈమృతి వార్త 'ఆంధ్రజ్యోతి'లో ప్రధానంగా ప్రచురితం కావడంతో సమగ్రశిక్ష ఏపీసీ శైలజ, జీసీడీఓ కవితకు శనివారం ఫోన్ చేసి, విషయంపై ఆరా తీసినట్లు సమాచారం.

రీ కేటగిరైజేషన్ పట్ల హర్షం

కదిరి అర్బన్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్యదర్శులకు రీ-కేటగిరైజేషన్ కల్పించడంపై ఏపీ గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఈమేరకు సంఘం రాష్ట్ర అసోసియేషన్ ప్రెసిడెంట్ రామ్మోహన్, జిల్లా అధ్యక్షుడు విశ్వనాథ్‌రెడ్డి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రీ-కేటగిరైజేషన్‌ను రాష్ట్ర కేబినెట్ ఆమోదించడం శుభ పరిణామన్నారు. ప్రస్తుతం పంచాయతీ కార్యదర్శులుగా ఉన్న పేరును పంచాయతీ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా మార్చడం హర్షనీయమన్నారు. దీనివల్ల 6గ్రేడ్‌గా ఉన్న పంచాయతీ కార్యదర్శులు గ్రేడ్-4లోకి మారి త్వరగా ప్రమోషన్ పొందే అవకాశం కలుగుతుందన్నారు. ఈ మార్పులకు కారణమైన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు సంఘం తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

ఐదుగురిని కరిచిన పిచ్చి కుక్క

గుంతకల్లు టౌన్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పక్కీరప్ప కాలనీలో శుక్రవారం రాత్రి పిచ్చి కుక్క స్వైరవిహారం చేసి ఐదుగురిని గాయపరిచింది. బాధితులు తెలిపిన మేరకు శనివారం రాత్రి కాలనీలో ఇంటి వద్ద ఉన్న వర్ష అనే చిన్నారిపై పిచ్చి కుక్క దాడి చేసి, కుడి చేతిని గాయపరిచింది. ఇది గమనించి అడ్డుకోబోయిన ఆ చిన్నారి తండ్రి నాగరాజును కూడా కరిచింది. అలాగే గీతా, చిట్టెమ్మ, వేణమ్మ కాళ్లు, చేతులను గాయపరిచింది. వీరిని వారి కుటుంబసభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చాలా రోజుల నుంచి కాలనీలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని పలుమార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు.

న్యూస్ బాక్స్

ఇసుక ట్రాక్టర్ల సీజ్


అధికారులు సీజ్ చేసిన ట్రాక్టర్లు

బత్తలపల్లి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని జ్వాలాపురం క్రాస్ వద్ద శనివారం తెల్లవారుజామున అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. మండలంలోని చిత్రావతి నది నుంచి అక్రమంగా ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్నట్లు ఆర్డీఓకు సమాచారం అందింది. దీంతో ఆర్డీఓ మహేష్ ఎస్ఐ సోమశేఖర్, పోలీస్ సిబ్బందితో వెళ్లి జ్వాలాపురం చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహించారు. అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను గుర్తించి, వాటిని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

'అవినీతిపై చర్యలు తీసుకోవాలి'

ధర్మవరం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): చేనేత ఎన్‌హెచ్‌డీసీ పట్టురాయితీలో అవినీతికి పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రగతిశీల చేనేత కార్మిక సంఘం రాయలసీమ జోన్ కన్వీనర్ పోలా లక్ష్మీనారాయణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్‌హెచ్‌డీసీ పట్టు రాయితీలో గత వైసీపీ పాలనలో కొందరు అవినీతి పరులు బోగస్ సహకార సంఘాలను సృష్టించారన్నారు. వాటి ద్వారా రూ. లక్షలు అవినీతికి పాల్పడ్డారని ఆరోపణలు ఉన్నా యన్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం వాటిపై విచారణకు కమిటీని నియమిం చిందన్నారు. ఆ కమిటీ అధికారులు ప్రస్తుతం చేనేత కేంద్రాల్లో విచారణ చేపడుతున్నారన్నారు. అధికారులు సక్రమంగా విచారణ జరిపి అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

సాగు భూములను సోలార్‌కు ఇవ్వొద్దని వినతి


తహసీల్దార్‌కు వినతి ప్రత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

నంబులపూలకుంట, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్న రైతుల భూములను సోలార్ కంపెనీలకు ఇవ్వకండి అని సీపీఎం, సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు వారు శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ దేవేందర్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే మండలంలో ఏడు వేల ఎకరాల సాగుభూములను రైతులు సోలార్ కంపెనీకి ఇచ్చారన్నారు. మండలంలో మరిన్ని సోలా ర్ ప్రాజెక్టులు వస్తున్నాయనీ, రైతులు వద్ద నుంచి భూములు తీసుకుంటున్నట్లు తెలుస్తోందని వారు తెలిపారు. సోలార్ ప్రాజెక్టుల వల్ల రైతులు భూములు కోల్పోయి జీవనోపాధిని కోల్పోతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయూ నాయకులు రమణ, రాజారెడ్డి, గంగిరెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

ఎస్టీ జాబితాలో చేర్చేలా కృషి చేయండి

● గుంటూరు ఎమ్మెల్యేకి రజక సంఘం నాయకుల వినతి


ఎమ్మెల్యే గల్లా మాధవిని కలిసిన రజక సంఘం నాయకులు

తనకల్లు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రజకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని మండలంలోని రజక సంఘం నాయకులు, ఉపాధ్యాయులు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవిని కోరారు. ఆమెను శనివారం గుంటూరులో కలిసి వినతిపత్రం అందజేసినట్లు వారు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానంలో రజకులను ఎస్టీ జాబితాలో చేరుస్తామని హామీ ఇచ్చినట్లు వారు గుర్తుచేశారు. 18 రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాలలో రజకులు ఎస్టీలుగా ఉన్నట్లు వివరించారు. ప్రభుత్వ పెద్దలతో చర్చించి రజకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని రజక సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేని కోరినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు నిరాశ వేమన, రజక సంఘం నాయకులు, ఉపాధ్యాయులు శివశంకర్, పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గుంతలమయమైన రోడ్డు

● ఐదు కిలోమీటర్ల ప్రయాణానికి అరగంట


గుంతలు పడిన మార్పురివాండ్లపల్లి, పెద్దఎద్దుల వారిపల్లి రోడ్డు

తనకల్లు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొంతలపల్లి రహదారి నుంచి పెద్దఎద్దులవారిపల్లి, చిన్నఎద్దులవారిపల్లి, కుర్మాలపల్లి, రాగినేపల్లి, మార్పురివాండ్లపల్లి గ్రామాలకు ఐదు కిలోమీటర్ల రహదారి ఉంది. ఈ రహదారిని చాలా ఏళ్ల క్రితం నిర్మించారు. ఆ తరువాత దానిపై అధికారులు కానీ, ప్రజాప్రతినిధు లు కానీ పిడికెడు మన్ను వేసిన పాపాన పోలేదు. దీంతో రోడ్డు మొత్తం గుంతలమయం అయిపోయింది. గుంతలమయమైన ఐదు కిలోమీటర్ల రహదారిలో ప్రయాణం సాగించడానికి అరగంటకు పైగా పడుతున్నట్లు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా వాణిజ్య పంటలైన టమోటా, బెండ, మిరప, బెల్ట్ చిక్కుడు, వివిధ రకాల పూల పంటలు పండిస్తున్నారు. ప్రతిరోజు ఈ ప్రాంతం నుంచి వివిధ వాహనాలలో రైతులు పండించిన పంటలను మార్కెట్లకు తరలిస్తున్నారు. అంతేగాకుండా మార్పురివాండ్లపల్లి, రాగినేపల్లి, కుర్మాలపల్లి, చిన్నఎద్దులవారి పల్లిల నుంచి ప్రతిరోజు వందలాదిమంది చీకటిమానిపల్లి, కొక్కంటిక్రాస్, తనకల్లు, అన్నమయ్య జిల్లా మొలకలచెరువుకు వెళ్లి వస్తుంటారు. ఈ రహదారిపై ఆటోలలో ప్రయాణం చేయాలంటే నరకయాతన అనుభవించాల్సిందేనని వారు వాపోతున్నారు. ద్విచక్రవాహన దారులు ఎవరో ఒకరు ప్రతిరోజు ఎక్కడో ఒకచోటు ఈ రోడ్డులో ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ ఐదు కిలోమీటర్ల రహదారిని పునర్నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రమాదకరంగా పాఠశాల పాత భవనాలు


శిథిలావస్థకు చేరిన భవనాలు

● తొలగించాలంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు

గాండ్లపెంట, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో పలు భవనాలు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉన్నాయి. వాటిని తొలగించేది ఎప్పుడని విద్యార్థుల తల్లి దండ్రులు ప్రశ్నిస్తున్నారు. పాఠశాల ఆవరణంలో గతంలో నిర్మించిన పురాతన భవనాలు చాలా ఏళ్లు గడవడంతో పైకప్పు పెచ్చులూడి, గోడలు నెర్రలు చీలి కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. అయితే పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఆ పాత పాఠశాల భవనాల వైపు వెళుతుంటారు. ఆ భవనాలు శిథిలావస్థలో ఉండటంతో ఎప్పుడు కూలి ప్రమాదం సంభవిస్తుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. వాటిని కూల్చివేయాలని సంబంధిత అధికారులకు రెండేళ్లుగా విన్నవిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరిగితే కానీ అధికారులు స్పందించరా అంటూ మండిపడుతున్నారు. అంతేగాకుండా శిథిలావస్థకు చేరిన పాత పాఠశాల భవనాల చుట్టూ అపరిశుభ్రత నెలకొంది. పిచ్చి మొక్కలు అధికంగా పెరిగాయి. దీంతో ఆ ప్రాంతంలో విషపురుగులు ఎక్కువగా సంచరిస్తున్నాయని విద్యార్థులు తెలుపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన పాత పాఠశాల భవనాలను తొలగించి, ప్రమాదాలు జరగకుండ చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు కోరుతున్నారు.

దిగుబడి నేలపాలు

● గాలివానకు నేలకొరిగిన అరటి చెట్లు


నేలకొరిగిన అరటిపంటను చూపుతున్న రైతు చెన్నారెడ్డి

ధర్మవరం రూరల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిగిచెర్ల గ్రామానికి చెందిన రైతు తాడిమర్రి చెన్నారెడ్డి సాగుచేసిన అరటిచెట్లు గాలివానకు నేలకొరిగి రైతుకు తీవ్రనష్టం వాటిల్లింది. రైతు చెన్నారెడ్డి మాట్లాడుతూ... తన మూడెకరాల్లో సుమారు 3వేలకు పైగా అరటిచెట్లు సాగుచేశానన్నారు. పది నెలలుగా కంటిరెప్పలా రేయింబవళ్లు శ్రమించి తెగుళ్లు రాకుండా చెట్లను కాపాడానన్నారు. ఇప్పటికి సుమారు రూ. 5లక్షల వరకు పెట్టుబడి పెట్టానని తెలిపారు. మరో వారానికి దిగుబడి వచ్చే సమయంలో రెండురోజులుగా కురిసిన గాలివానకు సుమారు 150చెట్లు నేలకొరిగాయని ఆవేదన వ్యక్తం చేశాడు. దీంతో సుమారు మూడు టన్నుల కాయల వరకు నష్టం వాటిల్లిందని రైతు పేర్కొన్నారు. రూ. లక్షలకు లక్షలు అప్పులు చేసి పంటలు సాగుచేస్తే, తీరా పంటదిగుబడి సమయంలో ప్రకృతివైపరీత్యాలతో నష్టపోతున్నామని రైతు తెలిపాడు. అధికారులు స్పందించి ఆదుకోవాలని కోరాడు.

దైవానుగ్రహంతో రాష్ట్రం అభివృద్ధి చెందాలి

● మాజీ మంత్రి పల్లె


విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

బుక్కపట్నం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): పార్వతీపరమేశ్వరుడి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి అన్నారు. బుక్కపట్నం మండలంలోని కృష్ణాపురం గ్రామంలో శనివారం పార్వతీ చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో శివలింగంతో పాటు అమ్మవారి విగ్రహం, ధ్వజ స్తంభం ప్రతిష్ఠను నిర్వహించారు. మాజీ మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే రాష్ట్రం అభివృద్ధిలో అగ్రగామిగా నిలవాలని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రజలకు సుపరిపాలన సాగాలని ఆ పరమేశ్వరుణ్ణి కోరుకుంటున్నామని తెలిపారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడిపంటలతో రైతులు ఆనందంగా ఉండాలని మాజీ మంత్రి ఆకాంక్షించారు. అనంతరం గ్రామంలో ఇటీవల మృతిచెందిన టీడీపీ కార్యకర్త నారాయణస్వామి కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అప్పస్వామి నాయుడు, మాజీ సర్పంచ్ నారాయణస్వామి, లక్ష్మీనారాయణ, గంగాధర్, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా పనిచేద్దాం


మాజీ మంత్రి పల్లెను సన్మానిస్తున్న పోతుల సురేష్

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలను కలిసికట్టుగా కూటమి తరపున ఘనంగా నిర్వహిద్దామని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పిలుపునిచ్చారు. పుట్టపర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి శనివారం వచ్చిన బీజేపీ నాయకుడు పోతుల సురేష్ మాజీ మంత్రి పల్లెకు పుష్పగుచ్ఛం అందచేసి పట్టుశాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీమంత్రి మాట్లాడుతూ కలసికట్టుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. కూటమి నాయకుల సహకారంతో పుట్టపర్తిని అభివృద్ధి పథంలో నడిపిద్దామన్నారు. నవంబరులో సత్యసాయి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిద్దామని, ఉత్సవాలకు ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, రాష్ట్రమంత్రులు, దేశవిదేశాల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. టీడీపీ పట్టణ కన్వీనర్ రామాంజినేయులు, గంగాధర్‌నాయుడు, రమేష్, సురేష్, కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

గంజివారిపల్లి పంచాయతీ ఏర్పాటు చేయండి

● ఎమ్మెల్యే కందికుంటకు పలు గ్రామాల ప్రజల వినతి


ఎమ్మెల్యేకి వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్థులు

కదిరి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): తలుపుల మండలంలోని గంజివారిపల్లి కేంద్రంగా ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేయాలని గంజివారిపల్లి తదితర గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌ను కోరారు. గంజివారిపల్లి, కొత్తపూలవాండ్లపల్లి, బోయపల్లి, తదితర గ్రామాల కు చెందిన అవుల మధుసూదన్ రెడ్డి, చిన్నలకోట్ల నాగభూషణం, అక్బర్, నరేష్, ముస్తఫా, బాబా తదితరులు ఎమ్మెల్యేని శనివారం పట్టణంలోని ఆయన నివాసంలో కలిశారు. గంజివారిపల్లి, కొత్తపూలవాండ్లపల్లి ఎస్సీకాలనీ, బోయపల్లి గ్రామాల ప్రజలు వేపమానిపేట పంచాయతీ కేంద్రానికి వెళ్లాలంటే దాదాపు 28 కిలోమీటర్ల దూరం ఉంటుందని తెలిపారు. దీంతో గ్రామ సచివాలయానికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ముఖ్యంగా పంచాయతీ కేంద్రానికి వెళ్లేందుకు నేరుగా రోడ్డు సౌక ర్యం లేదని, మండలకేంద్రానికి వెళ్లి అక్కడి నుంచి వెళ్లాల్సి ఉందన్నారు. గంజివారిపల్లి కేంద్రంగా పంచాయతీ ఏర్పాటు చేస్తే ఎంతో మంది ప్రయోజనంగా ఉంటుందని తెలిపారు. ఎన్నికల సమయంలోనూ పంచాయతీ కేంద్రంలోనే ఓటింగ్ కేంద్రాలు ఉండడంతో పలు గ్రామాల ప్రజలు ఓటు వేయడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు వెంకటరమణ, ముస్కిన్, ఓబులప్ప, గంగన్న, నజీర్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

తపాలాశాఖ పథకాలపై ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న తపాలాశాఖ అధికారులు, సిబ్బంది

ధర్మవరం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రజలకు తపాలశాఖలోని వివిధ పథకాలపై అవగాహన కల్పించి, వారికి బంగారు భవిష్యత్తును ఇవ్వడమే తపాలశాఖ లక్ష్యమని ప్రధాన తపాల శాఖ పోస్టుమాస్టర్ భానుకుమార్ పేర్కొన్నారు. తపాలా వారోత్సవాలలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన వివిధ పథకాలపై అవగాహన కల్పిస్తూ శనివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా భానుకుమార్ మాట్లాడుతూ... తపాలా శాఖలో ఇప్పటికి 82 నూతన ఖాతాలను నమోదు చేశామన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా నూతన ఆధార్‌కార్డు నమోదు చేస్తున్నామని, ఆధార్‌కార్డుల్లో తప్పొప్పులను సరిజేస్తున్నామని తెలిపారు. కావున ప్రజలు తపాలాశాఖ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రోడ్డుపైనే ఆవులు - వాహనదారులకు ఇబ్బందులు


కళాజ్యోతి సర్కిల్‌లో పశువులు

ధర్మవరం రూరల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలో రోడ్లపై ఆవుల సంచారం అధికంగా ఉంది. దీంతో వాహనదారులు చాలా ఇబ్బంది లు పడుతున్నారు. రోడ్ల పక్కన, రోడ్లపై పడిన చెత్తాచెదారం తిని అక్కడ సంచరిస్తున్నాయి. ప్రధాన కూడళ్లలోనే రోడ్లకు అడ్డంగా పడుకుంటున్నాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మాగోడు పట్టదా అన్నట్లుగా గోవులు అటు, ఇటు వచ్చే వాహనదారుల వైపు చూ స్తుంటాయి. అధికారులు స్పందించి గోవులను గోశాలలకు తరలించి, సంరక్షించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

బాలికల సంరక్షణ అందరి బాధ్యత

● బాలికా దినోత్సవంలో వక్తలు



జగరాజుపల్లి కేజీబీవీలో మాట్లాడుతున్న సీడీపీఓ జయంతి

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలను ప్రోత్సహిస్తే అన్నిరంగాలలో రాణిస్తారని సీడీపీఓ జయంతి పేర్కొన్నారు. ఆడపిల్లలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత సమాజంలో ప్రతిఒక్కరిపై ఉందన్నారు. మండలపరిధిలోని జగరాజుపల్లి కస్తూర్బా బాలికా విద్యాలయంలో శనివారం అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ లింగవివక్ష లేకుండా పిల్లలను ప్రోత్సహించాల ని సూచించారు. అనంతరం పోషక ఆహార ప్రదర్శనశాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో కస్తూరిబా పాఠశాల ఎస్ఓ మేఘన, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిత, సిబ్బంది పాల్గొన్నారు.

● అమడగూరు: మండలంలోని గుండువారిపల్లి కేజీబీవీలో శనివారం అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ గంగాదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. జడ్పీటీసీ కవిత, ఎంఈఓ జిలాన్‌బాషా, అంగన్‌వాడీ కార్యకర్త లావణ్య తదితరులు పాల్గొ న్నారు. విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

● నల్లచెరువు: మండల కేంద్రంలోని కేజీబీవీని, సంక్షేమ వసతి గృహాలను సీహెచ్ఓ రామచంద్రారెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కేజీబీవీలో నిర్వ హించిన అంతర్జాతీయ బాలికలదినోత్సవంలో పాల్గొన్నారు. సీడీపీఓ వెంకటలక్ష్మమ్మ, సూపర్‌వైజర్ జయ మ్మ, హాస్టల్ సిబ్బంది గోవిందు, సురేష్, కేజీబీవీ ఎస్ఓ శిరీష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● తనకల్లు: మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యా లయంలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులకు వ్యాసరచన పో టీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. సూపర్‌వైజర్ లక్ష్మీదేవ మ్మ, ఎస్ఓ అమిదాబి, ఎంఈఓ లలితమ్మ, ఎంపీహెచ్ఈఓ వెంకటరమణ, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో ఆలయం కిటకిట


క్యూలో ఉన్న భక్తులు

కదిరి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. వరుసగా సెలవులు రావడంతో శుక్రవారం సాయంత్రం నుంచే భక్తు లు ఆలయాన్ని చేరుకున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచే కాక కర్ణాటక రాష్ట్రం నుంచి ఎక్కువ మంది భక్తులు తరలివచ్చా రు. తెల్లవారుజామున నుంచే స్వామివారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్నారు. సర్వదర్శనంతో పాటు ప్రత్యేక దర్శనానికీ క్యూ కట్టారు. ఆలయ అధికారులు అన్నప్రసాద వినియోగం చేపట్టారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న చిత్రావతి


సంగమేశ్వరం వద్ద ప్రవహిస్తున్న నది

బత్తలపల్లి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని సంగమేశ్వరం వద్ద చిత్రావతి నది ఉధృతంగా ప్రవహి స్తోంది. కర్ణాటకలో కురిసిన వర్షాలకు చిత్రావతి నది ఉధృతంగా ప్రవహించడంతో శనివారం ధర్మవరం చెరువుకు భారీగా నీరు చేరింది. అలాగే సంగమేశ్వరం వద్ద ఉన్న చెక్‌డ్యాం నిండి నీరు పొర్లి ప్రవహిస్తోంది. దీంతో మండలంలోని చిత్రవతి నదికి దగ్గరగా ఉన్న గ్రామాలలో భూగర్భ జలాలు పెరుగుతాయని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సేవ చేసే చేతుల్లోనే సత్యసాయి మిషన్

● సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్


కల్వకుర్తిలో నూతనంగా ప్రారంభించిన సాయిమందిరం

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రేమ ఉన్న హృదయాల్లో, సేవకు సిద్ధమైన చేతుల్లోనే సత్యసాయి మిషన్ నిరంతరం వికసిస్తుందని సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనే జింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో శనివారం శ్రీసత్యసాయి మందిరాన్ని ఆర్జే రత్నాకర్ ప్రారంభించారు. కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే నారాయణరెడ్డి, వేలాదిమంది సాయిభక్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్జే రత్నాకర్ మాట్లాడుతూ భగవాన్ సత్యసాయి శతజయంతి ఉత్సవాల నేపథ్యంలో ఎకరా విస్తీర్ణంలో నిర్మించిన మూడు అంతస్తుల భవనం సాయి భక్తుల శ్రమ, సేవ, త్యాగాలకు ప్రతీకంగా నిలిచిందనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. ఈ సాయి మందిరం సాయిమిషన్ విస్తరణకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నట్లు స్థానిక ప్రశాంతి నిలయం వర్గాలు తెలిపాయి

ధర్మవరం చెరువులో గంగపూజ


గంగపూజ చేసిన మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల వర్గీయులు

ధర్మవరం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురిసిన వర్షాలకు ధర్మవరం చెరువు నిండి మరువ పారుతోంది. ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ వర్గీయులు శనివారం సాయంత్రం చెరువు మొదటి మరువ వద్ద గంగపూజ చేశారు.అనంతరం వారు మాట్లాడుతూ...గోనుగుంట్ల సూర్యనారాయణ ఎమ్మెల్యేగా సమయంలో సొంతఖర్చులతో కాలువ మరమ్మతులు చేయించి నీటిని ధర్మవరం చెరువుకు తీసుకొచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో గోనుగుంట్ల వర్గీయులు రామానాయుడు, బిల్వంపల్లి నారాయణస్వామి, దర్శినమల నాగరాజు, బొడగల గిరిధర్, రాప్తాటి రాము, నారాయణస్వామియాదవ్, చిలకం సూర్యనారాయణరెడ్డి, ఇమాంసాబ్, రాజు, జగదీశ్, కిష్ట, నారాయణ, పోతలయ్య, గంధమనేని నారాయణస్వామి పాల్గొన్నారు.

చేతికి అందే ఎత్తులో విద్యుత్‌తీగలు


కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలు

కొత్తచెరువు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పాత పోస్టాఫీసు సమీ పంలో ఓ ఇంటి ఎదుటే 11 కేవీ విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి. దీంతో ఆ ఇంటిలోకి వెళ్లాలంటే తీగల కింద నక్కినక్కి పోవాల్సి దుస్థితి ఏర్పడిందని స్థానికులు వాపోతున్నారు. రవీంద్ర అనే గ్రామస్థుడు ఆ ఇంటిలోనే చిల్లర అంగడి నిర్వహిస్తున్నారు. దీంతో రోజూ ఆ అంగడికి రోజూ సరుకులు కొనుగోలు చేసేందుకు ప్రజలు వస్తుంటారు. వారు ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా ఆ విద్యుత్‌తీగలు తగిలే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. ప్రస్తుతానికి తాత్కాలికంగా వాటికి ప్లాస్టిక్ పైపులను ఏర్పాటు చేశారన్నారు. ఆ 11కేవీ తీగలను మార్చాలని పలుమార్లు విద్యుత్ సిబ్బందికి తెలియజేసినా పట్టించుకోలేదన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే తప్ప విద్యుత్‌శాఖ అధికారులు స్పందించరా అంటూ స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ తీగలను మార్చేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆదర్శప్రాయుడు వాల్మీకి

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి



మాట్లాడుతున్న గుండుమల తిప్పేస్వామి

మడకశిరటౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆదర్శప్రాయుడు వాల్మీకి మహర్షి అని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి అన్నారు. శనివారం నగర పంచాయతీ పరిధిలోని బేగార్లపల్లి గ్రామంలో వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గుండుమల తిప్పేస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామాయణాన్ని అందించిన మహానుభావుడు వాల్మీకి అని కొనియాడారు. ఆ మహర్షిని అందరూ ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, నగర పంచాయతీ చైర్మన్ నరసింహరాజు, పట్టణ అధ్యక్షులు నాగరాజు, క్లస్టర్ ఇన్‌చార్జి రవికుమార్, కౌన్సిలర్ ఉమాశంకర్, నాయకులు చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

● సోమందేపల్లి: వాల్మీకి జయంతిని చాకర్లపల్లి, మంచేపల్లి గ్రామాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. చాకర్లపల్లిలో మహిళలు జ్యోతులు మోస్తూ ఊరేగింపు చేశారు. అదేవిధంగా మంచేపల్లిలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం వాల్మీకి మహర్షి విగ్రహానికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఆంజనేయులు, చాకర్లపల్లి శ్రీరాములు, మండ్లి హనుమంతు, చంద్రశేఖర్, దాము, మద్దిలేటి, మంజు, ధనాపురం నరసింహ తదితరులు పాల్గొన్నారు.

● పరిగి: వాల్మీకి జయంతిని శీగుపల్లి గ్రామంలో శనివారం ఘనంగా నిర్వహించారు. రామాయణాన్ని అందించిన వాల్మీకిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని సంఘం నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలుగు జిల్లా యువత కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, మారుతి, నాగప్ప పాల్గొన్నారు.

● పావగడ: వాల్మీకి జయంతిని పావగడ తాలూకా కోట గుడ్డం గ్రామంలో శనివారం వైభవంగా జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో పాలేగారు లోకేష్, కెంఎఫ్ డైరెక్టర్ జయప్ప, హనుమంతరాయ తదితరులు పాల్గొన్నారు.

● పెనుకొండ రూరల్: పెనుకొండ మండలం శెట్టిపల్లి గ్రామానికి చెందిన నాగేంద్రను వాల్మీకి బోయసంఘం అధ్యక్షుడిగా నియమించినట్లు రాష్ట్ర ఉపాధ్యక్షులు కేశవ, జనరల్ కార్యదర్శి నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా నాగేంద్రకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

● లేపాక్షి: వాల్మీకి జయంతిని లేపాక్షిలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు జ్యోతులతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం వాల్మీకి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నాగలమడకకు పాదయాత్ర

పెనుకొండ, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోటమీద ఆంజనేయస్వామి దేవస్థానం అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మెహర్‌బాబా ఆధ్వర్యంలో దాదాపు 80మంది పెనుకొండ నుంచి కర్ణాటక రాష్ట్రంలోని నాగలమడక సుబ్రహ్మణ్య ఆలయానికి పాదయాత్ర చేపట్టారు. శనివారం బ్యానర్లు, జెండాలు పట్టుకుని నాగలమడకకు పాదయాత్రగా బయలుదేరారు.



పాదయాత్రగా వెళుతున్న భక్తులు

యువతకు ఆటల పోటీలు

రొద్దం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): జాతీయ యువ దినోత్సవం సందర్భంగా రొద్దంలోని టింబక్టివ్ కలెక్టివ్ చిగురు ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించారు. శనివారం రొద్దంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మండలంలోని చిగురు, మహాశక్తి, కల్పవల్లి, మిళిత, ధరణి సంఘాలలోని యువతీ యువకులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఖోఖో, వాలీబాల్, షాట్‌పుట్, మ్యూజికల్ చైర్స్ తదితర పోటీలు నిర్వహించారు. ఇందులో 250మంది పాల్గొన్నారు. గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పూర్ణిమ, రామన్న, రమేజ, గౌరీ, సుకన్య, పీఈటీ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి

● ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పిలుపు

● స్వచ్ఛ హిందూపురం టీషర్ట్‌ల ఆవిష్కరణ



టీషర్టులను ఆవిష్కరిస్తున్న బాలకృష్ణ

హిందూపురం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం ఎమ్మెల్యే కార్యాలయంలో స్వచ్ఛ హిందూపురం టీషర్ట్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎవరి ఇళ్ల వద్ద వారు శుభ్రతను పాటించాలన్నారు. అప్పుడే పరిసరాలు కూడా శుభ్రంగా ఉంటాయని పేర్కొన్నారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కార్పొరేషన్ డైరెక్టర్లు చంద్రమోహన్, శ్రీదేవి, జయప్ప, సింగిల్‌విండో అధ్యక్షులు శంకర్, చెన్నమ్మ, నరసింహులు, నాగార్జునను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో నాయకులు అమర్నాథ్, రఘు, నవీన్, సతీష్, పరిమళ, భార్గవ్, ప్రవీణ్, చింటు, యుగంధర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు అభివృద్ధి కార్యక్రమాలకు హాజరు

ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నియోజకవర్గ పర్యటనలో భాగంగా రెండోరోజు ఆదివారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనున్నారు. ఉదయం చిలమత్తూరు మండలం తుమ్మలకుంటలో స్మార్ట్‌కార్డుల పంపిణీలో పాల్గొంటారు. అనంతరం ఎమ్మెల్యే కార్యాలయంలో మునిసిపాలిటీ అభివృద్ధిపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం నియోజకవర్గంలోని 69మందికి సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేయనున్నారు. అదేవిధంగా పలు శాఖల అధికారులతో సమీక్ష జరుపనున్నారు.

బాలయ్య చొరవతోనే చెరువుకు నీరు



గంగపూజలో పాల్గొన్న టీడీపీ నాయకులు

హిందూపురం, (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే బాలకృష్ణ చొరవతో అప్పులకుంట చెరువుకు నీరు వచ్చిందని మండల కన్వీనర్ హెచ్‌ఎన్ రాము అన్నారు. శనివారం అప్పులకుంట చెరువుకు హంద్రీనీవా నీరు రావడంతో భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ హయాంలో ఒక్క చెరువు కూడా నీరు రాలేదన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ చొరవ చూపడంతో చెరువుకు నీరు వచ్చిందని హర్షం వ్యక్తం చేశారు. పూజల్లో నాయకులు రామగిరి సూరీ, మధుసుధన్‌రెడ్డి, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

హక్కులను సంరక్షించాలి: సీడీపీఓ

సోమందేపల్లి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): బాలల హక్కుల సంరక్షణ అందరి బాధ్యత అని వారి హక్కులను సంరక్షించడం మనందరి బాధ్యతని సీడీపీఓ శాంతలక్ష్మీ తెలిపారు. శనివారం మండలంలోని పాపిరెడ్డిపల్లివద్ద ఉన్న కేజీబీవీలో బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టేందుకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. లింగ వివక్షతను రూపుమాపి బాలిక వికాసం కోసం పనిచేయాలన్నారు. విద్యార్థినులు చదువుపట్ల శ్రద్ధ వహించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఎస్‌ఓ అనిత మాట్లాడుత వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. చట్టాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అనంతరం వక్తృత్వ పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీడీపీఓ శాంతలక్ష్మి

● అగళి: మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఎస్‌ఓ నాగరత్నమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లీలావతి వ్యక్తిగత పరిశుభ్రత, బాల్యవివాహాలవల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు.

● అమరాపురం: మండలకేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. ముఖ్య అతిథులుగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కమలమ్మ పాల్గొన్నారు. విద్యార్థినులకు బాల్య వివాహాల వల్ల కలిగే పరిణామాలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జానకి, సూపర్‌వైజర్ సన్నమ్మ పాల్గొన్నారు.

● రొద్దం: విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తుకు ఇప్పటి నుంచి బాటలు వేసుకోవాలని పెనుకొండ సీడీపీఓ ధనలక్ష్మీపేర్కొన్నారు. శనివారం కస్తూర్బా పాఠశాలలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. బాలికలు ఏరంగాలోనూ తీసిపోకుండా తమ నైపుణ్యాన్ని చాటుకోవాలన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ నాగరత్నమ్మ, సూపర్‌వైజర్ అనురాధ, అంగనవాడీ కార్యకర్త అరుణ, హసీన, ముత్యాలమ్మ పాల్గొన్నారు.

మరువ పారుతున్న చెరువులు



మరువ పారుతున్న చల్లాపల్లి చెరువు

సోమందేపల్లి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని మంచేపల్లి, చల్లాపల్లి గ్రామ చెరువులు నిండి మరువ పారుతుండటంతో గ్రామస్థులు, ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులకు భారీగా వర్షం నీరు చేరడంతో మరువలు పారుతున్నట్లు స్థానికులు తెలిపారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో చెరువులు కళకళలాడుతుండగా స్థానికులు శనివారం గంగపూజ చేశారు.

వర్షాలకు దెబ్బతిన్న రోడ్డు

మరమ్మతులు చేయించిన మంత్రి సవిత

రొద్దం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): బురదమయంగా మారిన రోడ్డుకు మంత్రి సవిత తన సొంత ఖర్చుతో మరమ్మతులు చేయించారు. మండల కేంద్రంలోని వైఎస్‌ఆర్ సర్కిల్ నుంచి హరిజనవాడకు వెళ్లే రహదారి రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా బురదమయంగా మారింది. పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని మంత్రి దృష్టికి స్థానిక నాయకులు తీసుకెళ్లగా గరుగుమట్టిని తోలించి ఎక్స్‌కావేటర్‌తో చదును చేయించారు. దీంతో గ్రామస్థులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షులు వీరాంజనేయులు, డీలర్ల సంఘం అధ్యక్షుడు సిద్దన్న పాల్గొన్నారు.



మరమ్మతుల అనంతరం రోడ్డు

వేగంగా కాలువ మరమ్మతులు

మడకశిర రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో కేతేపల్లి సమీపంలో తెగిపోయిన హంద్రీనీవా కాలువకు సంబంధించి మరమ్మతుపనులు శరవేగంగా జరుగుతున్నాయని ఎన్‌హెచ్‌సీఎల్ ఇంజనీరు నాగార్జున తెలిపారు. కృష్ణా జలాలతోపాటు భారీగా కురిసిన వర్షపు నీరు కాలువకు చెరడంతో తెగిందన్నారు. యంత్రాల సహాయంతో పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ఆదివారానికి పూర్తికావచ్చని పేర్కొన్నారు.



కాలువ వద్ద మరమ్మతులు

వైద్య కళాశాలలను ప్రభుత్వమే నడపాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



మాట్లాడుతున్న గేయానంద్

పెనుకొండ, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలను పీపీపీ పద్ధతిన కాకుండా ప్రభుత్వ అధీనంలో నిర్మించి నడపాలని వక్తలు పేర్కొన్నారు. శనివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో రాయలసీమ అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షతన పెనుకొండ వైద్య కళాశాల ప్రభుత్వ అధీనంలో కొనసాగాలని రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, కాంగ్రెస్ నాయకుడు నరసింహులు, జనచైతన్యవేదిక రాష్ట్ర నాయకులు ఆదిశేషు, సీపీఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం కట్టాల్సిన మెడికల్ కళాశాలను పీపీపీ పద్ధతిలో ప్రైవేట్ సెక్టార్‌కు ఇవ్వడానికి ప్రభుత్వం చూస్తోందన్నారు. తక్షణమే ప్రైవేటీకరణను విరమించుకోవాలని, లేని పక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బహుజన చైతన్యవేదిక అధ్యక్షుడు రామకృష్ణ, పుట్టపర్తి రమణారెడ్డి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సుధాకర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ప్రవీణ్, సీపీఎం కమిటీ సభ్యులు హరి, శీన, పెద్దన్న, వెంకటేశ్, ఫక్రుద్దీన్, గిరీష్, సదాశివ, ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నాగమణి, శబానా, రమాదేవి, బావమ్మ, రమణ, యూటీఎఫ్ నాయకులు నారాయణస్వామి, రమేష్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరేష్, భాష పాల్గొన్నారు.

'వ్యక్తిగత శుభ్రత పాటించాలి'

అగళి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని డాక్టర్ శివానంద, మలేరియా సబ్ యూనిట్ అధికారి షమీవుల్లా పేర్కొన్నారు. అగళి మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌లో విద్యార్థులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు వాతావరణ మార్పుల వల్ల వ్యాపించే వ్యాధుల, దోమల నుంచి వచ్చే విషజ్వరాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు, బీసీ హాస్టల్ వార్డన్ సికిందర్‌బాషా, ఆరోగ్య కార్యకర్త గంగిరెడ్డి పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

ట్యాంకర్లతో నీటి సరఫరా

చిలమత్తూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాపుచెన్నంపల్లిలో తాగునీటి బోరు మోటారు మరమ్మతుకు గురికావడంతో మండల కన్వీనర్ శ్రీనివాసులు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేశారు. వారం రోజులుగా మోటారు పనిచేయకపోవడంతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. విషయాన్ని తెలుసుకున్న ఆయన వెంటనే అధికారులతో మాట్లాడారు. సమస్యను పరిష్కరించాలని కోరారు. అప్పటి వరకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామని గ్రామస్థులకు ఆయన హామీ ఇచ్చారు.



నీటిని పట్టుకుంటున్న గ్రామస్థులు

ఉపాధ్యాయ వృత్తి గొప్పది

మున్సిపల్ చైర్మన్ రమేష్

హిందూపురం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): సమాజాన్ని మార్చే శక్తి ఒక్క ఉపాధ్యాయుడికే ఉంటుందని మున్సిపల్ చైర్మన్ రమేష్ అన్నారు. శనివారం మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బదిలీ అయిన, పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి చాలా గొప్పదన్నారు. కార్యక్రమంలో డీవైఈఓ జాన్‌రెడ్డప్ప, ఎంఈఓ గంగప్ప, మున్సిపల్ టీచర్స్ పెడరేషన్ నాయకులు శ్రీరామ్‌ప్రసాద్, సిద్దగిరి శ్రీనివాస్, బాలకృష్ణ, జనార్దన్, హరిప్రసాద్, జగదీశ్, గోవర్దన్ తదితరులు పాల్గొన్నారు.



బదిలీ అయిన ఉపాధ్యాయులతో నాయకులు